మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



# అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ స్థలాలను వినియోగించుకుందాం!

● నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**మక్తల్,అక్టోబరు 18 ప్రభాతవార్త:** నియోజకవర్గ కేంద్రంలోని నూతనంగా నిర్మించే పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ స్థలాలను వినియోగించుకుందామని తద్వారా మరింత అభివృద్ధి చేయవచ్చని జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. పట్టణంలో శుక్రవారం ఆమె పలు ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. పట్టణంలో నూతనంగా నిర్మించబోయే 150 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం కోసం పట్టణ శివారులోని 916,917 సర్వే నంబర్లలో గల 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆమె పరిశీలించి, ప్రధాన రహదారికి ఆ స్థలం ఎంత దూరం అవుతుందని తహసిల్దార్ సతీష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. స్థలం హద్దుల చుట్టూ తిరిగి చూశారు. అనంతరం మక్తల్ పట్టణంలోని ట్యాంక్‌బండ్ వద్ద 316 సర్వే -మిగతా3లో..

## దవాఖానను పరిశుభ్రంగా ఉంచాలి

◆ మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి



దవాఖానాను తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి



**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 18 ప్రభాతవార్త :** జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వార్డులు, ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి తనిఖీ సందర్భంగా పిడియాట్రిక్ వార్డు మెట్ల వద్ద పాన్ మరకలు జిల్లా కలెక్టర్ గమనించి ఆసుపత్రి శానిటేషన్ సూపర్‌వైజర్‌లు పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారం రోజుల తర్వాత మళ్లీ ఆసుపత్రిని సందర్శించనున్నట్లు, పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపరిచి ఆసుపత్రి వార్డులు, ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మొదట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డు తనిఖీ చేశారు. అక్కడ ర్యాంప్‌ను పరిశీలించి రోగులు కింద పడకుండా తగు చర్యలు తీసుకుని ర్యాప్ సరి చేయాలని సూచించారు. అనంతరం ఐసియును సందర్శించారు.అక్కడ వెంటిలేటర్‌లు ఎన్ని ఉన్నాయి ఎన్ని ఉన్నాయి ఎన్ని పని చేస్తున్నాయి ఇంకా ఏమైనా అవసరం ఉంటే ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో హరేరామ హరేకృష్ణ ద్వారా అందిస్తున్న రూ.5 లకే భోజనం వద్ద భోజనం చేసిన తర్వాత తిన్న ప్లేట్‌లు పాలిథిన్ కవర్‌లో ఉంచడం పరిశీలించారు.మున్సిపాలిటీ నుండి ప్రతిరోజు చెత్త తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ ఆసుపత్రి ఆవరణలో చెత్త తొలగింపు పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించాలని సూచించారు. తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను తనిఖీ చేశారు. డయాగ్నోస్టిక్ సెంటర్‌లో తరచూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించే సీమెన్ యంత్రం తరచూ పని చేయక రక్త ఇతర పరీక్షలకు అంతరాయం కలగడానికి కారణాలు ఏమిటి టెక్నిషియన్‌లు సమాచారం అందించి ఎప్పటికప్పుడు రిపేర్‌లు ఉంటే సరి చేయాలని ఆదేశించారు. పిహెచ్‌సిలు, అర్బన్ హెల్త్ సెంటర్‌ల నుండి వచ్చే శాంపిల్స్ పరీక్షలు నిర్వహించి రిపోర్టులు వెంటనే పంపాలని, రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో ఫ్యామిలీ ప్లానింగ్ వార్డ్‌ను సందర్శించారు. రోగులతో మాట్లాడారు. పీడియాట్రిక్ వార్డు తనిఖీ చేశారు. పిడియాట్రిక్ వార్డు వద్ద పారిశుద్ధ్యం నిర్వహణ సరిగ్గా లేదని మరోసారి ఇలాంటి పరిస్థితి రిపీట్ అయితే శానిటేషన్ సిబ్బందిపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఆసుపత్రిలో స్ట్రేచర్‌లు, వీల్‌ఛైర్‌లు, ఇతరత్రా కావలసిన అవసరం ఉంటే ప్రతిపాదనలు సమర్పించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సంపత్‌కుమార్‌సింగ్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.పద్మ, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి డా. భాస్కర్‌నాయక్, సిహెచ్‌ఓ రామునాయక్ ఉన్నారు.

## అధునాతన శిక్షణ కేంద్రాల ద్వారా యువతకు శిక్షణ కార్యక్రమాలు

▶ ఈ నెలాఖరు వరకు ప్రవేశాలకు అవకాశం


▶ నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ జిల్లా, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా అడ్వాన్స్ ట్రైనింగ్ కేంద్రాల ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి కల్పన శాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్యతో కలిసి అడ్వాన్స్ ట్రైనింగ్ కేంద్రాల్లో అడ్మిషన్స్ ప్రక్రియ నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలోని మన్ననూరు ఐటీఐ నందు ఆధునాతన శిక్షణ కేంద్రాల్లో అడ్మిషన్ల ప్రక్రియ పర్యవేక్షణకు ప్రత్యేక నోడల్ అధికారులుగా జిల్లా పంచాయతీ రాజ్ అధికారిని నియమించామని, డీఆర్‌ఏ మరియు ఐటీడీఏ అధికారులను ఇందులో భాగస్వామ్యం చేశామని, విద్యార్థులు ఐటీఐలో అడ్మిషన్ పొందడానికి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఉపాధి కల్పన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్‌కి జిల్లాకలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏటీసీ కేంద్రాల గురించి అవగాహన పెంపొందించేందుకు వీలుగా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ఒకట్రెండు రోజుల్లోనే తాను క్షేత్రస్థాయిలో సందర్శించి ఏర్పాట్లను పరిశీలిస్తామన్నారు. యువతకు వృత్తిపరమైన అవకాశాలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో బహుళ సంస్థల్లో ఉపాధి కల్పనకు ప్రభుత్వం ఆధునాతన శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ధరఖాస్తు చేయుటకు చివరి తేదీ ఈ నెల 31వరకు పొడిగించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మరియు టాటా కన్సల్టెన్సీ సంయుక్తంగా ఆధునాతన సాంకేతికకు కావాల్సిన 6కోర్సుల్లో నేరుగా ప్రభుత్వ ఐటీఐ కళాశాల మన్ననూరు నందు ప్రవేశాలు జరుగుతున్నాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో లేబర్ అధికారిరాజ్‌కుమార్, జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, మన్ననూర్ ఐటీఐ ప్రిన్సిపల్ లక్ష్మణస్వామి, కల్వకుర్తి ఐటీఐ ప్రిన్సిపల్ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి పనులను పరిశీలించిన మంత్రి



బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**కొల్లాపూర్,అక్టోబరు18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చౌటబెట్ల గ్రామానికి వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డుపై ఎన్‌హెచ్ 167 కె.నంద్యాల కల్వకుర్తి జాతీయ రహదారికి సంబంధించిన ఫ్లై ఓవర్ నిర్మాణం జరుగుతుండగా ఎత్తు తక్కువగా ఉండడంతో వ్యవసాయ ఆధారిత గ్రామమైన చౌటబెట్ల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను తరలించ డానికి ఫ్లై ఓవర్ బ్రిడ్జి అడ్డుగా నిలుస్తుందని ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఎత్తు పెంచాలని గ్రామస్తులు రాష్ట్రమంత్రి జూపల్లి దృష్టికి తీసుకురాగా, శుక్రవారం ఆయన ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఎత్తు పెంచాలని సూచించారు. కొల్లాపూర్ నుంచి చౌటబెట్ల గ్రామానికి వెళ్లే దారిలో ఫ్లై ఎవర్ ఎత్తు తక్కు వగా ఉండడంతో భవిష్యత్తులో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని అందు వలన దాని ఎత్తు పెంచాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అధికారులు సానుకూలంగా స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మండల నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జోగులాంబ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

● అలంపూర్ చౌరస్తా నుండి అమ్మవారి ఆలయం వరకు ప్రత్యేక బస్సులు నడిపిస్తాం

● అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉంది

● రాష్ట్ర రవాణా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**ఇటిక్యాల,అక్టోబరు 18 ప్రభాతవార్త:** అలంపూర్ చౌరస్తా నుండి జోగులాంబ అమ్మవారి ఆలయం వరకు ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఏర్పాటు చేస్తామని కేంద్ర, రాష్ట్ర సహకారాలతో జోగులాంబ ఆలయ అభివృద్ధికి మరింత ప్రభుత్వం కృషి చేస్తుందని జోగులాంబ అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని ప్రజా పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి శక్తిని ఆశీర్వచనాన్ని ఇస్తూ ప్రజలకు ఎలాంటి ప్రకృతి వైఫల్యాలు జరగకుండా చూడాలని అమ్మవారిని కోరుకున్నట్లు రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. శుక్రవారం జోగులాంబ గద్వాల



జోగులాంబ ఆలయ సన్నిధిలో మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ కుటుంబ సభ్యులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పదవి ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకాగా ముందుగా మంత్రి కుటుంబ సమేతంగా అలంపూర్ పట్టణంలో వెలసిన ఐదవ శక్తిపీఠం జోగు లాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా దర్శించుకునేందుకు రాగా ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ కుటుంబ సమేతంగా కూడా మంత్రి వెంట ఉండగా ముందుగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. మొదటగా గణపతికి అభిషేకాలు, అనంతరం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆలయ విశిష్టతను వివరించి తీర్థ ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే శక్తులన్నీ బలహీనపడి ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందించేటట్లు ప్రభుత్వానికి శక్తిని ఇవ్వాలని అమ్మవారిని కోరుకున్నట్లు మంత్రి వివరించారు. అదేవిధంగా కేంద్ర ఆర్కాలజీ డిపార్టుమెంట్‌తో చర్చించి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌తో కలిసి కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు.వారం రోజుల్లోగా భక్తుల సౌకర్యార్థం అమ్మవారి హారతి సమయానికి ఆర్టీసి బస్సులన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. మా గౌడ సంఘం ఆధ్వర్యంలో వేములవాడ మాదిరిగా ట్రస్టు ఏర్పాటుచేసి అన్నదాన సత్రాలు రూములు భక్తులకు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం పాపనాసిశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, మంత్రిపొన్నం ప్రభాకర్‌కు హరిత టూరిజం వద్ద స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల నుండి మంత్రి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామచందర్, ఆలయ ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఈఓ పురంధరకుమార్, ఆలయ పాలక మండలి సభ్యులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఘనస్వాగతం పలికిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

● అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్





జిల్లా వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

**వనపర్తి అక్టోబర్ 18 ప్రభాతవార్త:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు పక్కా ప్రణాళికతో సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ అన్నారు. శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఐడిఓ సి సమావేశ మందిరంలో నిర్వహించిన సన్నాహక కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ నగేష్ తో కలిసి పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రూపొందించుకున్న ప్రణాళిక, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు,తదితర అంశాలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జులకు, వ్యవసాయశాఖ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వనపర్తి జిల్లాలో 297 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లుగా తెలిపారు. 4 లక్షల మెట్రిక్ టన్నుల పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత సీజన్ లో వరి గ్రేడ్ ఏ రకం ధాన్యానికి రూ. 2320 సాధారణ రకం ధాన్యానికి రూ2300 మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని అన్నారు. మరి కొద్ది రోజుల్లో రైతులు ధాన్యం తెచ్చే అవకాశం ఉండడంతో వారికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక సదుపాయాలతో సకాలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సూచించారు. ధాన్యం బరువు కొలిచే యంత్రాలు,గోనె సంచులు, ధాన్యం వర్షానికి తడవకుండా టార్పలిన్లు, రైతులకు తాగునీరు, తేమ కొలిచే యంత్రాలు వంటి అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.రూతుల నుంచి ధాన్యం సేకరణ అనంతరం ఏమిల్లుకు ట్రాన్స్ పోర్టు చేయాలనే అంశంపై అధికారులు ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.ధాన్యాన్ని కొనుగోలు చేసిన అనంతరం ట్యాబ్ ఎంట్రీ సహా ఇతర ప్రక్రియలు వేగంగా పూర్తి కావాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.సన్నాలను గుర్తించడంలో అవగాహన తప్పని సరి సన్నరకం వరి ధాన్యానికి సంబంధించి కొనుగోలు కేంద్రా ల్లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. సన్న రకానికి ప్రభుత్వంరూ 500 బోనస్ ఇస్తుందని,రైతులకు నష్టం కలగకుండా వాటిని సరిగా గుర్తించాలని చెప్పారు. ఆ తర్వాత సన్నాల గన్నీ బాగులను ప్రత్యేకంగాలోడ్ చేయాలని చెప్పారు. ప్రతి సంచిపై నెంబర్ తప్పనిసరిగా వేయాలన్నారు. సమావేశంలో పైర సరఫరాల శాఖ డిఎం ఇర్ఫాన్,డిసీఓ ప్రసాద రావు, డిసీఎస్ఓ కాశీ విశ్వనాథ్, డిఆర్డిఓ పీడీ ఉమాదేవి,జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, మార్కెటింగ్ అధికారి స్వరన్ సింగ్ సివిల్ సప్లై అధికారులు, వ్యవసాయశాఖ సిబ్బంది, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జులు, ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా సభ్యులు,రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

◆ దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ◆ సరళ సాగర్, శంకర సముద్రంలో చేప పిల్లలను వదిలిన ఎమ్మెల్యే



కానాయపల్లిలో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే

**కొత్తకోట అక్టోబర్ 18 ప్రభాతవార్త:** మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశం అని అందుకే వారి సంపదను వృద్ధి చేసేందుకు ఉచితంగా చేప పిల్లలను చెరువుల్లో వదులుతున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో మదనాపురం మండలం సరళసాగర్ ప్రాజెక్టు, కొత్తకోట మండలం కానయపల్లి గ్రామ శంకర సముద్రం చెరువులో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ముఖ్యతిథులుగా హాజరై 6 లక్షల 40 వేల చేప పిల్లలను వదిలారు.మదనాపురం, కొత్తకోట మండలంలోని చెరువులలో ఈ సీజన్‌కు దాదాపు 15లక్షల చేప పిల్లలను విడవడం జరుగుతుందని జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప తెలిపారు. ఉమ్మడి మండలలో చేప పిల్లలను వదిలే కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేప పిల్లలు ఉచితంగా ఇవ్వడంతో మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందని ఆయన తెలిపారు.ఈ సీజన్లో మత్స్యకారులు అడగకముందే ఈ కార్యక్రమం చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని అన్నారు. మత్స్యకారులు అన్ని రంగాల్లో రానించాలని అందుకు మా ప్రభుత్వం పూర్తి సహకరిస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం మత్స్యకారులకు ఎమ్ చేయలేదని గత బిల్లులే పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. వాటిని పరిష్కరిస్తూ మత్స్యకారులకు చేప పిల్లలను వదిలే కార్యక్రమం తీసుకుందని గుర్తు చేశారు.మత్స్యకారుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ పి ప్రశాంత్, కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, సిడిసి ఛైర్మన్ గొల్లబాబు, సీనియర్ నాయకులు రావుల కర్ణాకర్ రెడ్డి మత్స్యశాఖ సంఘ అధ్యక్షుడు రంగస్వామి, మాజీ జడ్పీటీసీలు రావుల జితేంద్రనాథ్ రెడ్డి, పీజే బాబు, మండల అధ్యక్షులు బిచుపల్లి యాదవ్,పట్టణ అధ్యక్షులు మేస్త్రి శ్రీనివాసులు,గ్రామ అధ్యక్షులు పగ్గాల రాములు, మత్స్యకారుల సంఘం అధ్యక్షులు కొత్తశ్రీనివాసులు,గోకరయ్య,శివ యాదవ్, నరేందర్‌రెడ్డి, దారమోని నాగరాజు, డిసిరాములు,సంద వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే నా లక్ష్యం : ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ



తుల్జాభవాని ఆలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**ఉప్పునుంతల,అక్టోబరు 18 ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆవులోనిబావి (పిరట్వాన్‌పల్లి) తండాలో గిరిజనుల ఆరాధ్య దైవమైన తుల్జా భవాని ఆలయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా గిరిజన సోదరులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో సుందరమైన ఆలయాన్ని నిర్మించినందుకు గిరిజనులను, గ్రామస్తులను ప్రత్యేకంగా అభినందించారు.గ్రామాభివృద్ధిలో భాగంగా బిటి రోడ్డు రెన్యువల్ నెల రోజుల్లో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అదేవిధంగా ఇందిరమ్మ గ్రామ కమిటి ద్వారా అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ఆయన అన్నారు. ఎస్సీ,ఎస్టీలకు ఇందిరమ్మ ఇండ్ల కోసం ఆరు లక్షల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఆయనపేర్కొన్నారు. దశల వారిగా గ్రామాల అభివృద్ధి చేయటం జరుగుతుందన్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మాజీ ఎంపిపి తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు వటువర్లపల్లి మాజీ సర్పంచ్‌శత్రునాయక్, కాంగ్రెస్ నాయకులు వేముల నరసింహారావు, వెల్టూరు మాజీ ఎంపిటిసి రెడ్డి రంగారెడ్డి, మాజీ సింగిల్‌విండో ఛైర్మన్ వీరోజు చంద్రమౌళి, అమ్రాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కటకం శ్రీనివాసచారి, కాల్వ గోవర్ధన్‌రెడ్డి,మత్స్యకారుల సంఘంజిల్లా నాయకులు పెబ్బేటి నిరంజన్, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు శేఖర్‌గౌడ్, సూరం ప్రశాంత్‌రెడ్డి (బిట్టు) దాసు, లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ భారత్‌లో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలి

● మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం



స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం

**కల్వకుర్తి, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** స్వచ్ఛ భారత్‌లో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు.పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షులు శివ ఆధ్వర్యంలో జిల్లా యువజన క్రీడల శాఖ మై భారత్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్‌పై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి, పొడి చెత్తపై అవగాహన పెంచుకోవాలని, స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో అందరు పాలు పంచుకోవాలన్నారు. ముఖ్యంగా కల్వకుర్తి పట్టణంలో స్వచ్ఛ భారత్‌లో,పరిశుభ్రతలో కేంద్ర, రాష్ట్ర పురస్కారాలు అందుకొని స్వచ్ఛతలో ప్రజలకు అవగాహన పరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యనిర్వహక ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు, సేవా బృందం సభ్యులు హర్షిత్, చింటూ తదితరులు ఉన్నారు.

## తెలంగాణ అథ్లెటిక్స్ మేనేజర్‌గా రమణ

**నారాయణపేట టౌన్,అక్టోబరు 18 ప్రభాతవార్త:** తెలంగాణ అథ్లెటిక్ జట్టు మేనేజర్‌గా ఆర్.రమణ నియమితులయ్యారు. రాష్ట్ర అథ్లెటిక్ సంఘం ప్రధాన కార్యదర్శి సారంగపాణి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 17 నుండి 19 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించే 35వ సంవత్సరం జూనియర్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో ఆయన మేనేజర్‌గా వ్యవహరిస్తారు. పేట జిల్లా వాసిని రాష్ట్ర మేనేజర్‌గా ఎంపిక చేయడంపై క్రీడాకారులు అథ్లెటిక్ సంఘం నాయకులు వ్యక్తం చేశారు.

## వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**కృష్ణ,అక్టోబరు 18 ప్రభాతవార్త:** మురహరిదొడ్డి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ప్రభుత్వ అధికారులు ప్రారంభించారు.అనంతరం వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన వరిధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కేంద్రాలను ఏర్పాటు చేశారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ జానయ్య, మాజీ సర్పంచ్ దేవేంద్రప్ప,రాకేష్, బాబు,ప్రతాప్, పార్వతి, శంకరమ్మ,రాజు, రైతులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## అక్షరాస్యతపై అవగాహన సదస్సు

**మక్తల్ టౌన్,అక్టోబరు 18 ప్రభాతవార్త:** మక్తల్ మండలం మాద్వార్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నపొర్ల ఎపిజివిబి బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు అందించిన అన్ని రకాల సౌక ర్యాలు ప్రతి ఖాతాదారుడు ఇన్సూరెన్స్ చేసుకోవాలని ప్రతి సంవత్సరం 436 ఇన్సూరెన్స్ రూ.20 ఇన్సూరెన్స్ 1000 ఎస్‌బిఐ జనరల్ ఇన్సూరెన్స్ అలాగు ఎపివై అటల్ పింఛన్ యోజన చేసుకోవాలని వివరించారు. అలాగే డిపాజిట్లు పొదుపులు కట్టుకోవాలని ప్రతి ఖాతాదారుడు ఏటిఎం కార్డు వాడాలని సమయం ఆదా చేసుకోవాలని అలాగే మొబైల్ బ్యాంకింగ్ గురించి వివరించారు. బ్యాంకు రుణాలు సకాలంలో రివాల్వ్ చేసుకోవాలని వాటివల్ల వచ్చే లాభాల గురించి వివరించారు. సామాజిక భద్రత పథకాలను ప్రతి ఖాతాదారుడు నమోదు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ దుర్గాప్రసాద్, ఎపిజివిబి సురేష్‌రెడ్డి, బ్యాంకు మిత్ర గుడిసె రాజు, గ్రామ ప్రజలు, రైతులు, యువకులు పాల్గొన్నారు.



అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

## ముమ్మరంగా బిజెపి సభ్యత్వ నమోదు

**ఆత్మకూరు అక్టోబర్18 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆత్మ కూరు మండలంలో బిజెపి ఆత్మకూరు మండలంలో బిజెపి సభ్యత్వ కార్యక్ర మాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్న ట్లుగా ఆత్మకూరు మండలం బిజెపి ఉపాధ్యక్షులు వేణు ప్రధాన కార్య దర్శి ఎల్లన్న విలేకరులకు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రోజు మండలం లోని ఆరేపల్లి గ్రామంలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడమే కాకుండా బిజెపి పార్టీలో సభ్యులుగా చేర్పించి బిజెపి కుటుంబ సభ్యులుగా ప్రతి ఒక్కరిని ఆహ్వాని స్తున్నట్లుగా వారు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను అంతేకాకుండా గత శాసనసభ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమవుతున్న విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషిచేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఆంజనేయులు ముదిరాజ్ వెంకటేష్ తదితరులతో పాటుగా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పియులో పుస్తకావిష్కరణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 18 ప్రభాతవార్త :** పాల మూరు యూనివర్సిటీలో అర్థ శాస్త్రం విభాగం లో పని చేస్తున్న సీనియర్ అధ్యా పకులు డా. వెంకట రాఘవేందర్ రచించిన వలసలు, గ్రామీణ ప్రాంతా లలో మానవ వనరుల కొరత అనే పుస్తకాన్ని యూనివర్సిటీ కాలేజ్ ప్రిన్సి పల్ డా. చంద్రకిరణ్ ఆవిష్కరించారు. ఈ మేరకు శుక్రవారంపాలమూరు యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వలస లు వెళ్లడం ద్వారా మానవ వనరుల కొరత ఏర్పడి, శ్రామిక కొరత ఏర్పడుతుందని, వ్యవసాయ చిన్న పరిశ్రమల ఉత్పాదకత కొరత ఏర్పడి ఉత్పత్తి కుంటుపడుతుందని, అలవాట్లు, అభిరుచులు వృత్తులు మారిపోయి కొత్త వృత్తులలో వ్యక్తులు మారతారని చెడు అలవాట్లకు అధిక వ్యయం చేయడం జరుగుతుందని, చిన్న పిల్లలకు చదువు కోల్పోవడం శ్రామికులుగా మారే అవకాశం ఉంద ని, అలాంటి పరిస్థితులను అధిగ మించి నైపుణ్యాలు పెంపొందించుకుని, గ్రామీణ ఆర్థిక పరిపు ష్టిత కోసం ఈ పుస్తకం ఎంతో ఉప యుక్తంగా ఉంటుందని అన్నారు. ముందుమాట ప్రొ॥ రవింద్ర రేనా, దర్పన్ యూనివర్సిటీ సౌతా ఫ్రికా వారు రాయడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా. కృష్ణయ్య, జాయింట్ డైరెక్టర్ డా.అంకం భాస్కర్, సీనియర్ అధ్యాపకులు డా. కిశోర్,విభాగాధిపతి డా.జిమ్మికాటన్, అధ్యాపకులు డా. వేణు, డా.రవికుమార్, డా.అర్జున్‌కుమార్, డా.పర్వతాలు, డా.శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి,జ్ఞానేశ్వర్, డా.సురేష్,డా.రామరాజు, జానకిరాములు, సూపరింటెండెంట్ రాము, డా. చంద్రశేఖర్, డా. పుష్పలత,నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

## అన్నాసాగర్‌లో క్షయవ్యాధి నివారణ శిబిరం

**భూత్పూర్,అక్టోబర్ 18,ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామ ఆరోగ్య ఉప కేంద్రం లో భూత్పూర్ మండల పీహెచ్‌సీ ఆరో గ్యాధికారులు,సిబ్బంది శుక్రవారం క్షయవ్యాధి నిర్ధారణ, నివారణ శిబిరం నిర్వహించారు.గ్రామంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని జిల్లా క్షయ నివారణ, నియంత్రణాధికారి డాక్టర్ మల్లిఖార్జున్ సందర్శించారు. గ్రామానికి చెందిన దాదాపు 150మంది అనుమానితులకు ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించి,25మంది కళ్లె పరీక్షలు నిర్వహించినట్లు భూత్పూర్ పీహెచ్‌సీ సీహెచ్‌ఓ అయూబ్‌ఖాన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఒ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్,డాక్టర్ రాధిక,హెల్త్ సూపర్‌వైజర్,సుధాకర్,వెంకటేష్,గోపాలకృష్ణ,బాలరాజ్,రాజు, కృష్ణ, గిరి, జానకి,ఆశ కార్యకర్తలుఅనురాధ,సంతోష,వెంకటేశ్వరమ్మ,సావిత్రి,మంజుల,పుష్ప,పాల్గొన్నారు.



క్షయవ్యాధి శిబిరంలో పాల్గొన్న డాక్టర్ రబ్, డాక్టర్ రాధిక,సీహెచ్‌ఓ అయూబ్‌ఖాన్

## వారాంతపు సెలవులు అమలు చేయాలి

**మక్తల్,అక్టోబరు 18 ప్రభాతవార్త:** మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మి కులకు తక్షణమే వారాంతపు సెలవు లు అమలు చేయాలని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్.కిరణ్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద గేట్ ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు క్రమం తప్పకుండా సబ్బులు, చెప్పులు, నూనెలు, బట్టలు ఇవ్వాలన్నారు. వారాంతపు సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.పట్టణంలో జనాభా పెరుగుదలకు అనుగుణంగా చెత్త తొలగించే కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. పిఎఫ్ అమలుకాని కార్మికులకు తక్షణమే పిఎఫ్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు జి.రాజు, కె.రాములు, ఈశ్వరయ్య, దోగి అశోక్, రవి. జి. కృష్ణయ్య, ఆకాశ్, హన్మంతు, రామలింగం, వెంకటేష్, డి.నర్సింలు, బండారి మల్లేష్, జగ్గలి బాబు, జగ్గలి ఆంజనేయులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## ఉప్పునుంతల ఎస్సైగా వెంకట్‌రెడ్డి

**ఉప్పునుంతల,అక్టోబరు18 ప్రభాతవార్త:** ఉప్పునుంతల ఎస్సైగా వెంకట్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.చారగొండ ఎస్సైగా విధులునిర్వహించిన వెంకట్‌రెడ్డి బదిలీపై ఉప్పునుంతలకు వచ్చా రు. గతంలో ఎస్సైగా పని చేసిన లెనిన్‌ను విఆర్‌లో ఉంచారు. ఆయన స్థానంలో చారగొండ ఎస్సై వెంకటరెడ్డి ఉప్పునుంతల ఎస్సైగాబాధ్యతలు చేపట్టారు.ఇసుక అక్రమ రవాణా చెక్కు పడేనా? మండలంలో ఉన్నదుందుభి వాగు నుంచి భారీ సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా ను కట్టడి చేయలేకపోయారని గతంలోపని చేసిన ఎస్సైలెనిన్‌ను రాష్ట్ర పోలీస్‌ఉన్నతాధికారులు నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయానికి అటాచ్ చేశారు.నూతనంగా చారగొండ నుంచి ఉప్పునుంతలకు బది లీపై వచ్చినఎస్సై వెంకట్‌రెడ్డి కట్టడి చేస్తారా లేదా అని వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

**ఆత్మకూరు అక్టోబర్18 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణానికి చెందిన లక్ష్మణరావు ఈనెల మొదటి వారంలో ఆత్మకూరు నుండి వనపర్తికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా సెల్‌ఫోన్ పోయిన విషయాన్ని తక్షణమే ఆత్మకూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లుగా ఎస్సై వెల్లడించారు. ఈ మేరకు బాధితుడు సెల్‌ఫోన్ సిఈఐఆర్ నెంబర్ ఆధారంగా ఆత్మకూర్ పోలీస్ వారి సహకారంతో ట్రేస్ చేయగా గురువారం రోజు బాధితుడి సెల్‌ఫోన్ గుర్తించి అందజేసినట్లుగా ఎస్సై నరేందర్ విలేకరులకు తెలిపారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోయిన విషయాన్ని తక్షణమే ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేసిన పక్షంలో న్యాయం చేయగలమని ఎస్సై తెలిపారు.

## దిలిప్‌కుమార్ కుటుంబానికి ఆర్థిక సాయం

**భూత్పూర్,అక్టోబర్ 18,ప్రభాతవార్త:** ఇటీవల మృతిచెందిన భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని సారిక టౌన్‌షిప్ నివాసి,ట్రైబల్ వెల్ఫేర్ ఏఒ దిలిప్‌కుమార్‌కు కుటుంబానికి శుక్రవారం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ శాఖ అధికారులు,ఉద్యోగులు తమ సహాయంగా రు.లక్షా 30వేల ఆర్థిక సహాయం అందించి నట్లు ఎస్‌డబ్లుఒ,సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి తెలిపారు.ఈ ఆర్థిక సహాయాన్ని మృతుడు దిలిప్‌కుమార్ భార్య సోమేశ్వరికి అందజేసినట్లు సనాతన తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిటీడీఒ నిశిత,రిటైర్డ్ టీటీడీఒ రాములు,నారాయణపేట డీఎస్సీడీఒ ఉమాపతితో పాటు ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఉద్యోగులు,నాయకులు చిన్న నాయక్,రాములు, పవన్ కుమార్, నాగరాజు,రామ్‌లాల్, జమీల్,లింగం,రాజేందర్,రఘుమారెడ్డి పాల్గొన్నారు.

## పల్లెల్లో ఉన్న క్రీడాకారుల క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయాలి

● వనపర్తి లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్

**వనపర్తి టౌన్ 18 ప్రభాతవార్త:** పల్లెల్లో ఉన్న క్రీడాకారుల క్రీడా నైపు ణ్యాన్ని వెలికి తీసి ప్రపంచ స్థాయిలో విజేతలను చేసేందుకు సి.యం. కప్ ఎంతో దోహదపడుతుందని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ అన్నారు. నవంబరు మాసంలో ప్రారంభం కానున్న సి.యం. కప్ క్రీడా జ్యోతిని వనపర్తి జిల్లాలో సంఘీభావ ర్యాలీగా శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానం నుండి ర్యాలీ నిర్వహించగా అదనపు కలెక్టర్ జ్యోతి ఇన్చార్జి రతన్ కుమార్ బోస్ నుండి కాగడా అందుకొని ర్యాలీలో ముందు నడిచారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ మొదటి వారంలో సి.యం కప్ క్రీడలు, గ్రామ, మండల జిల్లా స్థాయిల్లో నిర్వహించడం జరుగుతుందని ఆ గెలుపొందిన క్రీడాకా రులతో హైదారాబాద్‌లో రాష్ట్ర స్థాయి క్రీడలు నిర్వహిస్తారని తెలిపారు. గ్రామాల్లో ఉన్న విద్యార్థుల క్రీడా సామర్థ్యాన్ని వెలికి తీసి ప్రపంచ స్థాయి విజేతలుగా నిలిపిందేకు ఈ క్రీడలుఎంతో ఉపయోగ కరంగా ఉంటాయని అన్నారు. అందువల్ల విద్యార్థులు తప్పకుండా క్రీడల్లో పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిఎస్పీ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ విద్యార్థులు ఆటలు ఆడటం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం, క్రీడా స్ఫూర్తి అలవడుతుందని తెలియజేశారు. సి.యం.కప్ క్రీడలను జిల్లాలోని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి సుధీర్ రెడ్డి ర్యాలీ ఇన్చార్జి లు గోకుల్,రతన్ కుమార్ బోస్, మధు,పి.ఈ.టి సురేందర్ తో పాటుక్రీడాకారులు,విద్యార్థులుభారీ సంఖ్యలోర్యాలీలో పాల్గొన్నారు.




సియం కప్ ర్యాలీలో పాల్గొన్న లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్

## అధికారుల ఎదుట డబల్‌బెడ్ లబ్ధిదారుల గోడు!



సిద్ధాయపల్లి డబుల్ బెడ్ ఇళ్ల సముదాయంలో లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ పీడీ వైద్యం భాస్కర్

**భూత్పూర్,అక్టోబర్ 18,ప్రభాతవార్త :** తమకు తాగునీరు అందడం లేదని కొందరు,డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గాలేదని మరికొందరు,విద్యుత్ లైట్లు వెలగడం లేవని ఇంకొదరు.. ఇలా సమస్యల మీద సమస్యల్ని అధికారుల ముందు సిద్దాయపల్లి డబుల్‌బెడ్ ఇళ్ల లబ్ధిదారులు ఏకం గా ఏకరువు పెట్టారు.గత ప్రభుత్వం పేదలకు కేటాయించిన డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణ పటిష్టత,నాణ్యతతో పాటు కాలనీలోరోడ్లు, డ్రైనేజీల పరిస్థితి,తాగునీటి సరఫరా,విద్యుత్తు సరఫరా వంటి అంశాలపై జిల్లా ఆడిట్,ఆర్‌డి అధికారులు,ఉద్యోగులు గడిచిన మూడ్రో జులు డబుల్ ఇళ్ల సముదాయంలో తనిఖీ(ఆడిట్)లు నిర్వ హించి డబుల్ బెడ్ ఇళ్లల్లో నివాసముంటున్న లబ్ధిదారుల నుంచి అభిప్రాయ సేకరణ జరిపి రిపోర్టును అధికారులకు సమర్పించారు. రిపోర్టుల ఆధారంగా అధికారులు శుక్రవారం భూత్పూర్‌మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు సిద్దాయపల్లిలోని డబుల్ బెడ్ ఇళ్ల సముదా యంలో లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కాలనీ వాసులు తమ గోడును అధికారుల ముందు విన్నవించుకున్నారు.తమ కాలనీని ఎవరూ పట్టించుకోవడంలేదని, పేరుకే మున్సిపాలిటీలో ఉందని,కాలనీలో అన్ని సమస్యలే ఎదుర్కొ ంటున్నామని సమావేశంలో పాల్గొన్న లబ్ధిదారులు అధికారుల ముందు తమ ఆవేదన వ్యక్తం చేశారు.మీరిచ్చిన ఫిర్యాదులన్ని త్వర లో పరిష్కరిస్తామని,రాబోయే మూణ్నెళ్లలో మంచినీటి సమస్య ఏర్పడకుండా చర్యలు చేపడతామని హౌసింగ్ కార్పొరేషన్ పీడీ వైద్యం భాస్కర్ లబ్ధిదారులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భూత్పూర్ మండల డిప్యూటీ తహశిల్దార్ గీత,మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి,ఆర్ఐలు వెంకటేష్,బాలసుబ్రహ్మణ్యమ్‌తో పాటు రెవెన్యూ,హౌసింగ్ కార్పొరేషన్ ఉద్యోగులు,డబుల్ బెడ్ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.



## పదిశాతం రిజర్వేషన్ అన్ని కులాలకు వర్తింపజేయాలి

- బీసీ జాగృతిసేన వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ డిమాండ్

**భూత్పూర్,అక్టోబర్18,ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా అగ్రకులాలవారు కేవలం ఏడు శాతానికి మించిలేరని,ఇందులో రెండు శాతానికి మించి పేదలు లేరని,వీరికి పదిశాతం రిజర్వేషన్ ఎలా కల్పిస్తాం ని,ఇది సామాజిక న్యాయస్ఫూర్తికి విరుద్ధమని బీసీ జాగృతిసేన వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ పేర్కొన్నారు. కేంద్రం ఈబీసీకి అమలు చేస్తున్న 10శాతం రిజర్వేషన్‌ను ఆర్థికంగా వెనకబడిన అన్ని కులాలు,వర్గాలకు వర్తింప జేయాలని,లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు.శుక్రవారం భూత్పూర్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన బీసీ జాగృతి సేన ముఖ్యనాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసం గించారు.పోటీ పరీక్షలలో ఎక్కువ మార్కులు వచ్చిన బీసీ అభ్యర్థుల కంటే తక్కువ మార్కులు వచ్చిన అగ్రకులాలకు ఉద్యో గాలు కల్పించడంపై రిజర్వేషన్లపై మాట్లాడే అగ్రకులాల నాయకులు నోరు విప్పాలని డిమాండ్ చేశారు.ఈడబ్లుఎస్ రిజర్వేషన్ తమిళనాడు, బీహార్ రాష్ట్రాలలో లేదని,మన రాష్ట్రంలో అమలు చేయకుండా ఈ రిజర్వేషన్‌ను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత యాభై ఏళ్లుగా బీసీకులాల గణన చేపట్టా లని,విద్య,ఉద్యోగ,ఉపాధి,ఆర్థిక,రాజకీయ,పారిశ్రామిక రంగాలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని నినదిస్తున్న పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం యాభై శాతం రిజర్వేషన్ల సీలింగ్ విధానానికి విరుద్ధంగా ఈడబ్లుఎస్ రిజర్వేషన్ కల్పించడం విడ్డూరంగా ఉందని కృష్ణయాదవ్ ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ జాగృతిసేన జిల్లా అధ్యక్షుడు వెల్కిచర్ల బాలస్వామి,మాజీ సర్పంచి నాగయ్యతో పాటు నాయకులు గోపాల్,శ్రీనివాస్,నరేందర్,భరత్‌కృష్ణ,రవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయాదవ్

## జాతీయ స్థాయిలో బహుమతి సాధించాలి

డీఈఓ రవిందర్



విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ రవిందర్

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 18 ప్రభాతవార్త:** జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించాలని డీఈఓ రవిందర్ సూచించారు. శుక్రవారం ఆర్‌విఎం సమావేశ మందిరంలో జరిగిన కళా ఉత్సవం జిల్లాస్థాయి పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లా డారు. చదువుతో పాటు విద్యార్థులు కలలు, ఆటపాట అన్నింటిలో పాల్గొనడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యంగా ఉంటారని సూచిం చారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పాల్గొని జాతీయ స్థాయికి వెళ్లాలని అక్కడ మన జిల్లా యొక్క నైపుణ్యాన్ని ప్రదర్శించి చక్కటి పేరు బహుమతులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో 269మంది విద్యార్థులు వివిధ కళలలో తమ ప్రదర్శనలు ఇచ్చారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయికి పంపిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమం అకాడమిక్ మానిటరింగ్‌అధికారి దుంకుడు శ్రీనివాస్, సీఎంఒ బాలుయాదవ్, ఎంఈఒ లక్ష్మణ్‌సింగ్, న్యాయ నిర్ణేతలు గుముడాల చక్రవర్తి, చలపతి, శంకర్, సీఆర్పీలు శ్రీనివాస్, గీత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మీకు మేము అండగా ఉంటాం

● దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**కొత్తకోట అక్టోబర్ 18 ప్రభాతవార్త:** మీకు మేము అండగా ఉంటాం మీకు ఏ ఆపద వచ్చిన అక్కున చేర్చుకునేందుకు అందుబాటులో ఉంటామని అనారోగ్యానికి గురైన బాధితులకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి భరోసా ఇచ్చారు.శుక్రవారం దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మండలం వడ్డేవాట తండా కు చెందిన పాత్లవత్ జోలి నిమ్స్ ఆస్పత్రిలో మోకాళ్ళ సర్జరీ కోసం, సీఎం సహాయ నిధి ద్వారా 75,000 వేల రూపాయల ఎల్ఓసిని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యపరంగా ఏ సమస్య వచ్చినా నా వంతు సహకారం ఉంటుందని సూచించారు. ఎల్ఓసి ద్వారా అనారోగ్య బాధితులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మీకు మేము అండగా ఉంటాం మీరు కూడా ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు బిమపల్లి,తిరుపతి, బలరాం తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు ఎల్ఓసి అందజేస్తున్న ఎమ్మెల్యే


## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కులు అందజేస్తున్న దృశ్యం

**ఉప్పునుంతల,అక్టోబరు 18 ప్రభాతవార్త:** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు శుక్రవారం అచ్చం పేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం సహాయనిధి కింద మంజూరైన లబ్దిదా రులకు అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండల పరిధిలోని బిసి 32, ఈబిసి 2, ఎస్టీ 4,ఎస్సీ 8 లబ్దిదారులు కళ్యాణలక్ష్మి పథకా నికి సంబంధించి మొత్తం 46 మందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో అచ్చం పేట ఆర్డీఓ మాధవి,స్థానిక తహసిల్దార్ ప్రమీల, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మాజీ ఎంపిపి తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, వెల్టూరు మాజీ ఎంపిటిసి రెడ్డి రంగారెడ్డి,మార్కెట్ డైరెక్టర్ గోపిరెడ్డి రమేష్‌రెడ్డి, కృష్ణ నాయక్, మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శేఖర్ గౌడ్,తిప్పర్తి జగన్మోహన్‌రెడ్డి, కాల్వ గోవర్ధన్‌రెడ్డి, నరసింహా రావు, సూరం ప్రశాంత్‌రెడ్డి (బిట్టు), మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మేడమోని భాస్కర్, రతన్‌సింగ్, లబ్దిదారులు, మహిళలు పాల్గొన్నారు.

## సదగోడులో గాలికుంటు నిరోధక టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారిని డా. దీప్తి

**ఉప్పునుంతల,అక్టోబరు 18 ప్రభాతవార్త:** పశు సంవర్ధకశాఖ వారి ఆదేశాల మేరకు ఉప్పునుంతల పశు వైద్యాధికారిణి డా. దీప్తి ఆధ్వర్యంలోశుక్రవారం మండలంలోని సదగోడు గ్రామం లో గాలికుంటు నిరోధక టీకాలు వేయడం జరిగింది.ఈ శిబిరంలో 152 ఆవులు, 105 గేదెలకు టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారిని దీప్తి వివరించారు. ఈ శిబిరంలో డా. దీప్తితో పాటు సిబ్బంది కమల, బాలకోటి, మీరాజ్, హబీబ్, అంజయ్య, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

**నేడు మామిళ్లపల్లిలో:** నేడు శనివారం మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో గాలికుంటు నిరోధక టీకాల శిబిరం నిర్వహిస్తున్నామని పశువైద్యాధికారిని డా. దీప్తి తెలిపారు.ఈ శిబిరానికి రైతులు పశువులను తీసుకొచ్చి టీకాలు వేయించు కోవాలని ఆమె సూచించారు.

## అక్టోబర్ 21వ తేది నుండి పోలీస్ సంస్మరణ వారోత్సవాలు ప్రారంభం

● విద్యార్థులకు ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీల నిర్వహణ

● జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు

**గద్వాల అక్టోబర్18 ప్రభాత వార్త:** విధి నిర్వహణలో భాగం గా పోలీస్ అధికారులు, సిబ్బంది తమ అమూల్యమైన ప్రాణాలను సహితం లెక్కచే యకుండా విధులు నిర్వర్తిస్తు న్నారని, వారి ప్రాణ త్యాగం వలనే నేడు శాంతియుతంగా ఉంటున్నారని ఎస్పీ శ్రీనివాస రావు అన్నారు. వారి ప్రాణత్యా గాలను గుర్తు చేసుకోవడంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు ఈ నెల 21 నుండి 31వ తేది వరకు జోగులాంబ గద్వాల్ జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలలో అమరవీరుల దినోత్సవం, సైకిల్ ర్యాలీ, వ్యాసరచన పోటీలు, ఫోటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉచిత రక్తదానం శిబిరం కార్యక్రమం, జాతీయ ఐక్యత దినోత్సవం , పోలీస్ కళాబృందం , పోలీస్ బ్యాండ్ ద్వారా జనరద్దీ గల ప్రాంతాలలో కార్యక్రమాల నిర్వహణ, అన్ని థియేటర్స్ యందు స్లైడ్స్ ద్వారా ప్రచారం మొదలగు కార్యక్రమాలు నిర్వహిసా మని ఎస్పీ తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఫ్లాగ్‌డే సందర్భంగా ఆన్‌లైన్‌లో ఈ వెబ్‌సైడ్ ద్వారా వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరుగుతుందని వ్యాసరచన పోటీలు మూడు భాషల్లో అనగా తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో అభ్య ర్థులు పాల్గొ నవచ్చని వ్యాసరచన పోటీలు కేటగిరీల వారిగా కేటగిరి-1 స్టూడెం ట్స్‌కు ఇంటర్మీడియట్ వరకు విచక్షణతో కూడిన మొబైల్ వాడకం. కేటగిరి -2 డిగ్రీ అండ్ స్టూడెంట్స్ కు తెలంగా ణను డ్రగ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అనే అంశాల మీద విద్యార్థులకు ఆన్‌లైన్ నందు వ్యాసరచన పోటీలు నిర్వర్తిం చడం జరుగు తుందన్నారు. ఆన్‌లైన్‌లో 24 అక్టోబర్ 2024 వరకు సమర్పించ వచ్చునని ప్రతి కనబరిచిన మొదటి ముగ్గురు అభ్యర్థు లను జిల్లా పోలీసు కార్యాలయంలో బహుమతుల ప్రధానం చేసి తదుపరి ఈ ముగ్గురు అభ్యరఽ్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగు తుందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఎస్పీ తెలిపారు.



పోలీస్ ఫ్లాగ్ డే వివరాలు తెలుపుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

## చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి మృతి

**వీపనగండ్ల అక్టోబర్ 18 ప్రభాతవార్త:** వీపనగండ్ల శివారులోని మాదిగ నరసింహ పొలం దగ్గర యువకుడు ఉరివేసుకొని కనిపించిన శవం శుక్రవారం నాడు వెలుగులోకి వచ్చింది విష యం పరిశీలించగా చిన్నంబాయి మండలం అమ్మాయి పల్లి గ్రామానికి చెందిన ఎరుకలి బాలచంద్ర వయసు 20 సంవత్స రాలు గత వారం రోజుల కిందట ఆ యువకుని తల్లి లక్ష్మి చెడు తిరుగులు తిరగవద్దు తాగుడుకు బానిస కావొద్దు అని మంద లించడంతో అతను మనస్థాపానికి గురి అయ్యి 16 వ తేదీన ఇంటి నుండి పరారై పోయినట్లు తల్లి లక్ష్మి తెలిపింది. అయితే అనేక సార్లు తాగి వచ్చి ఇబ్బంది పడుతున్న సందర్భంలో చెడుతిరుగులు తిరగవద్దు అని మందలించడం వల్ల ఇంటి నుండి పారిపోయి ఇలా శవమై కనిపించాడని బోరున విలపిస్తూ ఆమె తెలిపింది.అక్కడక్కడ చుట్టాల దగ్గర పొలాల వెంబడి తిరగి వెతుకుచుండగాశుక్రవారం పొలం చెట్లసమీపంలో బైకు కానరా వడంతో ఆ చుట్టుపక్కల వెతకడం వల్ల మోతుకచెట్టుకు ఉరివేసు కొని శవమై కనిపించాడని ఆమె తెలిపారు. ఈ విషయాన్ని వీపనగండ్ల ఎస్సై కెరాణి కేసు నమోదుచేసినట్లు ఆమె తెలిపారు.

## ప్రతి బూతుకు 200ల సభ్యత్వ నమోదు చేయించాలి

బిజెపి దేవరకద్ర నియోజకవర్గం ఇంచార్జి కొండ కొండ ప్రశాంత్‌రెడ్డి


**దేవరకద్ర,అక్టోబరు 18 ప్రభాతవార్త:** ప్రతి బూతు నుండి దాద పు 200ల సభ్యత్వాలను నమోదు చేయించాలని దేవరకద్ర నియోజకవర్గ బిజెపి ఇంచార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి అన్నారు. దేవరకద్రలో ఆయన మాట్లాడారు. భారతీయ జనతా పార్టీ అధి ష్టానం ఆదేశానుసారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈనెల 23 వరకు పొడిగించడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రహించాలన్నారు. దేవరకద్ర నియోజ వర్గంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టాలని ఆయన సూచించారు. భారతీయ జనతా పార్టీ కార్య కర్తలు, నాయకులు బూత్ అధ్యక్షులు,మండల అధ్యక్షులు అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేయించాలన్నారు.సభ్యత్వ నమో దును అధికంగా చేయించిన వారికి పార్టీలో క్రియాశీలక పదవు లు, స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని పార్టీ కార్యకర్తలు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టాలని కొండ ప్రశాంత్‌రెడ్డి సూచించారు.

## ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కల్టివేటర్‌లో పడి యువకుడికి తీవ్ర గాయాలు

**వెల్దండ, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని పోచమ్మ గడ్డ తాండకు చెందిన వడ్త్యవత్ పవన్ (23) తన వ్యవ సాయ పొలంలో ట్రాక్టర్ కల్టివేటర్ ద్వారా చదును చేస్తుండగా ప్రమాదవశాత్తు కల్టివేటర్‌లో కాలు పడటంతో తీవ్రంగా గాయ పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం యెన్నం ఆసుపత్రికి తరలించారు.

## ఎదురెదురుగా కార్లు ఢీ

**వెల్దండ, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహ దారిపై కేవీఆర్ ఫంక్షన హాల్ సమీపంలో ఎదురెదు రుగా కార్లు ఢీకొన్న సంఘ టన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... వంగూరు మండ లం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి దంపతులు హైదరా బాద్‌కు వెళ్తుండగా, అచ్చంపేటకు చెందిన శంకర్‌నాయక్ హైదా బాద్ నుంచి అచ్చంపేటకు వస్తుండగా రెండుకార్లు తమ ముందు న్న కార్లను ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎదురెదురుగా ఢీ కొని కృష్ణారెడ్డి కారు టైరు పగిలి చెట్టుకు ఢీకొని స్వల్ప గాయాలతో ఇరువురు బయట పడ్డారు.



చెట్టుకు ఢీకొన్న కారు

## తెగిన కేఎల్ఐ డీ-82 కాల్వ...

**వెల్దండ, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** మండలంలోని గుండాల గ్రామ సమీపంలో కేఎల్ఐ డీ-82 అక్విడ్‌కు అనుసంధానంగా ఉన్న మట్టి కాలువ తెగిపోయి నీరు వృధాగా పంట పొలాల్లోకి పారుతుంది. గత సంవత్సరం కూడా కాల్వ ఇక్కడే తెగడంతో తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టారు. ఈ యేడాది కూడా కాలువ తెగిపోవడంతో సాగునీరు వృధాగా పారుతుందని, అధికారులు స్పందించి వెంటనే తెగిన కాల్వను పూడ్చి రైతులకు సాగునీరు అందించాలన్నారు.



## వైద్య విద్యార్థిని వెల్దండ హసినికి సన్మానం




వైద్య విద్యార్థి వెల్దండ హసినిని సన్మానిస్తున్న సామాజిక సేవకులు పాపిశెట్టి రాము

**వెల్దండ, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి వెల్దండ హసిని ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని నిర్మల్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలోఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక సేవకులు పాపిశెట్టి రాము మండల కేంద్రంలో ఎంబీబీసీ సీటు సాధించిన వెల్దండ హసినిని శాలువాలతో సన్మానించి సరస్వతి మాత చిత్రపటాన్ని బహుకరించి రూ.10వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించి అభినందించారు. ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ వైద్య విద్యలో ఉన్నతంగా రాణించిఅత్యున్నత వైద్యులుగా ఎదగాలనిఆయన అకాంక్షించారు. కార్యక్రమంలో నారాయణపూర్ శ్రీనునాయక్, చల్లా మధుసూదన్‌రెడ్డి, బొమ్మిశెట్టి శ్రీనివాసులు, జీ.ప్రభాకర్, రవి ఉన్నారు.

## పెబ్బేరులో వరుసగా చోరీలు

### ఎక్కువ కిరాణా షాపుల్లో... శుక్రవారం రోజు రెండు కిరాణా షాపులో చోరీ



**పెబ్బేరు అక్టోబర్ 18 ప్రభాతవార్త :** పెబ్బేర్ పట్టణంలో దొంగల ముఠా రోజు రోజుకు రెచ్చిపోతున్నాయి దొంగలు పెబ్బేరు అడ్డగా చేసుకున్నట్లు శుక్రవారం సుభాష్ చౌరస్తా పెబ్బేరు నడి బొడ్డున మొత్తం సీసీ కెమెరాలు ఉండే ప్రదేశం శుక్రవారం రోజు రెండు కిరాణా షాపుల్లో దొంగలు పడ్డారు. శివ సాయి కిరాణం,సాయిరాం కిరాణం కిరాణా షాపుల్లో ఎక్కువ సిగరెట్ల కొంత నగదు కిరణం సామాన్ పోయినట్లు బాధితులు తెలియజేశారు. పది నెలల్లో ఇప్పటికీ 39 షాపుల్లో చోరీ చేసినట్లు సమాచారం ఇప్పటికైనా ఉన్నతాధికారులు పెబ్బేరుకు సిబ్బందిని పెంచి రాత్రిపూట ఎక్కువగా నిఘా పెంచాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

## ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం



ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరిస్తున్న దృశ్యం

**మాగనూరు,అక్టోబరు 18 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని నేరడుగాం గ్రామ పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించే దిశగా ఉపాధి హామీ సిబ్బంది అడుగులు వేశారు. కూలీల సమస్యలను తెలుసుకుని జాబ్‌కార్డుకు సంబంధించిన, వారి ఖాతాల వివరాలకు సంబంధించిన సమస్యలను అక్కడే పరిష్కారం చేస్తూ కొత్త జాబ్‌కార్డుకు కావలసిన వారికి అక్కడే కొత్త జాబ్‌కార్డు ఇవ్వడం, జాబ్ కార్డులో ఒక వ్యక్తిని చేర్చడం వంటి సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చేశారు. దీనిపట్ల గ్రామ ప్రజలు, కూలీలు హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రానికి వచ్చే బాధ తప్పించారని సంతోషించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రహమతుద్దిన్, ఎపిఓ హర్షవర్ధన్‌రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ బాలు, పంచాయతీ కార్యదర్శి అర్జున్, క్షేత్ర సహాయకుడు కురుమప్ప, గ్రామ ప్రజలు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## జిల్లా విద్యార్థులందరికి పోటీ పరీక్షలలో శిక్షణలు ఇప్పించాలి

● రాష్ట్ర రవాణా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**గద్వాల అక్టోబర్ 18 ప్రభాతవార్త:** జిల్లా విద్యార్థులందరికి పోటీ పరీక్షలలో అన్ని రకాల శిక్షణలు అందిం చి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా కృష్ణవేణి చౌక్ వద్ద నిర్వహించిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీనవర్గాలకు అన్ని రంగాలలో ప్రాధాన్యం కల్పిస్తుందని అన్నారు. ఇందులో భాగంగా బీసీ అభ్యర్థి అయిన నీలి శ్రీనివాసులను జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులుగా నియమించడం జరిగిందని తెలిపారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గద్వాల జిల్లాలో రాబోవు కాలంలో విద్యార్థులకు అండగా ఉండి నిరుద్యోగులందరికి పోటీ పరీక్షలలో అన్ని రకాలుగా శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలలో జిల్లాను మొదటిస్థానంలో నిలపాలని మంత్రి ఆకాంక్షించారు.

## అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ స్థలాలను వినియోగించుకుందాం!

(మొదటి పేజీ తరువాయి)

నంబర్ స్థలాన్ని మున్సిపల్ దుకాణ సముదాయ నిర్మాణం కోసం ఆమె పరిశీలించారు. అలాగే మక్తల్ సమీపంలోని గొల్లపల్లి శివారులో గల 126 సర్వే నంబర్‌లోని 18 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని సంప్రదించి ఆయా ప్రభుత్వ స్థలాలకు రహదారి సౌకర్యం, ప్రధాన రహదారి నుంచి ఆయా స్థలాలకు మధ్య ఎంత దూరం ఉంటుందో తెలుపుతూ పూర్తిస్థాయిలో నివేదికతో కూడిన ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలని కలెక్టర్ తహసిల్దార్ సతీష్, సర్వేయర్ రాజన్నను ఆదేశించారు

## బికెఎస్ నాయకుల ఆధ్వర్యంలో సన్మానం

**నారాయణపేట టౌన్,అక్టోబరు 18 ప్రభాతవార్త:** జిల్లా విద్యుత్ అధికారి ఎస్సీ ప్రభాకర్‌రావు ఎస్సీఈ చీఫ్ ఇంజనీర్‌గా ప్రమోషన్ పొందిన సందర్భంగా శుక్రవారం నారాయణపేట జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు సన్మానించారు.అనంతరం భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ, జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుండి జిల్లా విద్యుత్ ఎస్సీగా బాధ్యతలు వహించి నిరంతరంగా రైతులకు ఈ ప్రాంత ప్రజలకు సేవలందించిన అధికారిగా ప్రజల మన్ననలు పొంది ఈ ప్రాంత విద్యుత్ సమస్యలు తన దృష్టికి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరించి న్యాయం చేసిన సందర్భంగా అధికారుల మన్ననలు పొందిన ఒక మంచి అధికారి ఈ ప్రాంతం నుండి వెళ్లిపోవడం మనసును బాధించిన ఒక ఉన్నతమైన పదవి వచ్చినందుకు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో బికెఎస్ నాయకులు బాలప్ప, రంగారెడ్డి, ఆకుల వెంకటప్ప, ఆంజనేయులు యాదవ్, లక్ష్మినారాయణ, రాముతో పాటు తదితరులు ఉన్నారు.

## మాట నిలబెట్టుకోవడంలో మోడీకి సాటిలేరు

### బిజెపి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ నందునామాజీ

**నారాయణపేట టౌన్,అక్టోబరు 18 ప్రభాతవార్త:** ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో ప్రధాని నరేంద్ర మోడీకి ఎవరు సాటిలేరని బిజెపి జిల్లాలీగల్ సెల్ కన్వీనర్ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్‌నందు నామాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాజాగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మాజీ సైనికుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేశారని అన్నారు. అలాగే రైతుల సంక్షేమం కోసం గోధుమలు, పప్పు ధాన్యాలు మద్దతుధరను భారీగాపెంచారని అన్నారు.ఏడాదిలో మూడువిడతలుగా రైతులకు తప్పని సరిగా కిసాన్‌సమ్మాన్ కిందప్రతి రైతుఖాతాలో రూ.2 వేలు జమచేస్తూ రైతు పెన్నిధిగా నిలిచారని అన్నారు.

## మారుతి ఇన్‌ఫ్రా డెవలపర్స్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**మూసాపేట,అక్టోబరు 18 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రగతినగర్ కాలనీలో మారుతి ఇన్ఫ్రా డెవలప్‌మెంట్ కార్యాలయాన్ని శుక్రవారం దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూసాపేట మండలం నందిపేట గ్రామానికి చెందిన సిహెచ్ యాదగిరి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కష్టపడి అంచెలంచెలుగా ఒక ఉన్నత స్థానాన్ని చేరుకుని ప్రగతి నగర్ వద్ద మారుతి ఇన్ ఫ్రా డెవలపర్స్ యజమాని కావడం గర్వించదగ్గ విషయమని అన్నారు. యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టి చంద్రశేఖర్, యూత్ అధ్యక్షులు సుదిరెడ్డి లక్ష్మికాంత్‌రెడ్డి, ఎన్.తిరుపతయ్యగౌడ్,నాగిరెడ్డి, మాజీ జడ్పీటిసి బలనర్సింలు, వేముల ఎంపిటిసి సత్యనారాయణ, జానంపేట కృష్ణయ్య, జానంపేట లక్ష్మణ్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జీఎంఆర్‌ను కలిసిన భూత్పూర్ కాంగ్రెస్ నాయకులు

**భూత్పూర్,అక్టోబర్ 18,ప్రభాతవార్త:** భూత్పూర్ మండలంలో రోడ్లు,బస్సు సౌకర్యం లేని గ్రామాలు, ప్రాంతాల సమస్యల్ని శుక్రవారం భూత్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్)ను స్వయంగా కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.స్పందించిన ఎమ్మెల్యే జీఎంఆర్ త్వరలో మండలంలోని అన్ని సమస్యల్ని పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామి ఇచ్చినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.అనంతరం జిల్లా ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌ను కలిసి బస్సు సౌకర్యం లేని గ్రామాలకు బస్సులు వేయాలని కోరినట్లు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు దెంది లక్ష్మికాంత్‌రెడ్డితో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారని కేసిరెడ్డి తెలిపారు.

## క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి కప్

**-సీఎం కప్ టార్చ్ ర్యాలీకి ఘనంగా స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్**



సీఎం కప్ టార్చ్‌తో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ

**నాగర్‌కర్నూల్ జిల్లా, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ టార్చ్ ర్యాలీ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణానికి చేరుకోగా సీఎం కప్ టార్చ్ ర్యాలీకి జిల్లా కలెక్టర్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఈ ర్యాలీ జిల్లా పరిషత్ హై స్కూల్ నుంచి లిటల్ ఫ్లవర్ హైస్కూల్ వరకు కొనసాగిన ర్యాలీలో ఎస్పీ వైభవ్ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో పాటు సుమారు 600 మంది విద్యార్థులు, క్రీడాకారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేయాలనే సంకల్పంతో గ్రామీణ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాకారులను తయారు చేయాలనే లక్ష్యంతో క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామీణ యువతలో క్రీడాకారులను వెలికి తీసి వారికి మంచి సౌకర్యాలు కల్పించి మంచి భవిష్యత్తు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఈ క్రీడలను ప్రారంభించడం జరిగిందన్నారు. యువత క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరకంగా,ధృడంగా ఉండటమే కాకుండా మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. జిల్లాలోని మూరు మాల ప్రాంతాల్లో ఉండే క్రీడాకారులు వారి ప్రతిభను గుర్తించి వారిని రాష్ట్ర, జాతీయ, ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే ప్రయత్నమే సీఎం కప్ ఉద్దేశమన్నారు. పల్లెల నుంచి ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీయడానికి సీఎం కప్ చక్కటి వేదిక అన్నారు. ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి సీతారం, వివిధ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, సీనియర్ క్రీడాకారులు, ప్రజా ప్రతినిధులు, పలు రకాల క్రీడా అసోసియేషన్ ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మన ఇసుక మన వాహనం ద్వారా ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలి

■ నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు

**నారాయణపేట టౌన్,అక్టోబరు18 ప్రభాతవార్త:** జిల్లాలో గుర్తించిన ఇసుక రీచ్‌ల నుంచి మన ఇసుక మన వాహనం (ఆన్‌లైన్) ద్వారా ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ సూచించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో ఏర్పాటు చేసిన డిఎల్ఎస్‌సి (డిస్ట్రిక్ లెవల్ స్యాండ్ కమిటి) సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో గృహ అవసరాల నిమిత్తంఇసుక కావాల్సిన వారు మన ఇసుక మన వాహనం ద్వారా అనుమతులు పొంది ఇసుకను తీసుకోవచ్చని ఆమె తెలిపారు.జిల్లాలో ఆన్‌లైన్ ఇసుక రవాణాను రెండు మూడు రోజులలో ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఆమె ఆదేశించారు. సమావేశంలో మైనింగ్ ఏడిసంజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 7ఇసుక రీచ్‌లు ఉన్నాయని, కానీ వాటిలో ప్రస్తుతం మాగనూరు మండలం వర్కూర్‌లో మూడు,మక్తల్ మండలం దాసర్‌దొడ్డిలో ఒక రీచ్‌లో ఇసుక అందుబాటులో ఉందని, ఈ నాలుగు రీచ్‌లలో మొత్తం 66,554 క్యూబిక్ మీటర్ల ఇసుక ఉన్న ట్లు భూగర్భ జల వనరులశాఖ అధికారులు రిపోర్టు ఇచ్చారని కలెక్టర్‌కు తెలిపారు. ఇక మిగిలిన కొత్తపల్లి,లింగాల్‌చెడ్, నందిగామ, నాగిరెడ్డిపల్లి రీచ్‌లలో వర్షాల కారణంగా ఇసుక రవాణా సాధ్యం కాదని ఆయన చెప్పారు.అయితే మైనింగ్, గ్రౌండ్ వాటర్, తహసిల్దార్ రీచ్‌ల పరిశీలనఎలా చేశారని, ఇదివరకు జిల్లాలో కొనసాగించిన ఆన్‌లైన్ ఇసుక బుకింగ్, అనుమతులు, ఓటిపి రవాణా ఒక రీచ్‌లో రోజుకు ఎన్ని క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలించే అవకాశం ఉంటుందని కలెక్టర్‌ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇదివరకు ఉన్న ఈ ఇసుక విధా నాన్ని స్టడీ చేసేందుకు ఒకసబ్ కమిటిని ఏర్పాటు చేయాలని ఆమె తెలిపారు.సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీఓ మధుమోహన్, భూగర్భ జల వనరులశాఖ అధికారిణి రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ, భగీరథ ఏంట్రా ఈఈ రంగారావు, సురేష్, కలెక్టరేట్ సంబంధిత సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

## ఎర్రవల్లిలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఘనస్వాగతం



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఘన స్వాగతం పలికిన మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు

**ఇటిక్యాల,అక్టోబరు 18 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నీలి శ్రీనివాసులును ప్రభుత్వం నియామకం చేసింది. శుక్రవారం పదవి ప్రమాణస్వీకారం నిర్వహిస్తుండగా కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరవుతుండగా హైదరాబాద్ నుండి బయలుదేరి ముందుగా జోగులాంబ అమ్మవారిని దర్శించుకునేందుకువెళ్తుండగా మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, అలంపూర్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రవల్లి మాజీ సర్పంచ్ జోగులరవి, సీనియర్ నాయకుడు లక్ష్మీనారాయణరెడ్డి, శ్యామసుందర్రావు, లోకారెడ్డి, అదాం, మద్దిలేటి అంజి రాంప్రసాద్, పరశురాముడు తదితరులు కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఘనస్వాగతం పలికి శాలువా పూలమాలలతో సన్మానించారు. అనంతరం అక్కడి నుండి జోగులాంబ అమ్మవారి ఆలయ దర్శనానికి మంత్రి బయలుదేరి వెళ్లారు.

## ప్రతి రైతుకు షరతులు లేని రుణమాఫీ చేయాలి

◆ కార్పొరేట్లకు రాయితీలు.. పేదలపై భారాలు ◆ సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు



మాట్లాడుతున్న సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు

**కొల్లాపూర్,అక్టోబరు 18 ప్రభాతవార్త:** నియోజకవర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి మండలం కేంద్రంలో మార్కెట్ యార్డు ఆవరణలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం మండల ప్రథమ మహాసభను శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసులు హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజల్ని విస్మరిస్తున్నాయని దేశంలో బిజెపి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేట్ వ్యక్తులకు ఊడిగం చేస్తూ ప్రజలపై పన్నుల భారాలు మోపుతూ నిత్యం నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతూ పేద ప్రజలను నడ్డి విరిచే విధంగా పరిపాలన కొనసాగించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయలేదన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 50 శాతం కూడా రుణమాఫీ కాలేదన్నారు. కొత్తరేషన్ కార్డులు,పింఛన్లు పెంచడం ఆలోచన లేకుండా పూటకొక మాట చెబుతూ కాలం ఎలా తీస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామంటూ కొత్త పింఛన్లు ఇస్తామంటూ మాయమాటలు చెప్తూ కనీస వేతనాలు లేవన్నారు. రాష్ట్రంలో పేదలు గుడిసెలు వేసుకున్న వారందరికి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లనిర్మాణం చేసి పేదలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు ఎం. శ్రీనివాసులు, నరసింహ, శివశర్మ, సిపిఎంపార్టీ మండల కార్యదర్శి ఎం.దశరథ, నాయకులు శంకర్, బాలస్వామి, సతీష్, ఎల్లయ్య, శేషమ్మ, చంద్రకళ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

## విధులకు హాజరు కాని టీచర్‌ను సస్పెండ్ చేయాలి




విధులకు హాజరు కాని టీచర్‌ను సస్పెండ్ చేయాలని ధర్నా చేస్తున్న దృశ్యం

**కొల్లాపూర్,అక్టోబరు 18 ప్రభాతవార్త :** నియోజకవర్గ పరిధిలోని పెంట్లవెల్లి మండలం జటప్రోలు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులుగా చేరి విధులకు దుమ్మా కొడుతున్న సైన్స్ టీచర్ వెంకటేశ్వర్లు శెట్టిని విధుల నుండి బహిష్కరించాలని ప్రజా సంఘాల నాయకులు డి.ఈశ్వర్, ఎస్.హనుమంతు, డి.శేఖర్‌లు డిమాండ్ చేశారు. జటప్రోల్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ముందు ధర్నా నిర్వహించి అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులుకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలకు రాకుండా విద్యార్థులకు చదువులు బోధించకుండా వేతనం తీసుకుంటున్న టీచర్ వెంకటేశ్వర్లు శెట్టిని విధుల నుండి బహిష్కరించి కొత్త టీచర్‌ను నియమించాలని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ పేద విద్యార్థి, విద్యార్థినిలు చదువుతున్నారని, వారికి ఇలాంటి విధులకు దుమ్మా కొడుతున్న టీచర్లు ఉంటే విద్యార్థుల చదువులు ఎలా కొనసాగుతాయని వారు విమర్శించారు.అతన్ని సస్పెండ్ చేయాలని లేకపోతే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి. శ్రీనివాసులు, రవి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## అమ్మాయిపల్లిలో మెడికల్ క్యాంపు

**చిన్నంబావి,అక్టోబరు 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అమ్మాయిపల్లి గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించాలని ప్రజలకు ఆరోగ్యం పట్ల సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించాలని, కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ సభ్యులు ఉమ్మడి జిల్లా సెక్రెటరీ చారకొండ బాబు వనపర్తి జిల్లా వైద్యాధికారులను కలిసి వినతి పత్రం ఇవ్వడంతో స్పందించిన వనపర్తి డిఎంహెచ్ఓ అమ్మాయిపల్లి గ్రామంలో మెడికల్ క్యాంపును వీపనగండ్ల ప్రాథమిక హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎంహెచ్ఓ డా.విజయచంద్రమోహన్ పాల్గొని పర్యవేక్షించారు.ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికవ్యాధులు డయాబెటిక్, క్యాన్సర్ వీటిపట్ల సకాలంలో మందులు వాడుతూ నిత్యజీవనశైలిలో భాగంగా యోగా,వ్యాయామం,వాకింగ్ దినచర్యగా అలవాటు చేసుకోవాలని,మంచి ఆహారం తీసుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల వైరల్ ఫీవర్, డెంగ్యూ, మలేరియా, చికన్‌గున్యా, కలుషిత నీటి ద్వారావాంతులు, విరోచనాలు, టైఫాయిడ్, పసిరికలు మొదలగు వ్యాధుల పట్ల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు.చారకొండ బాబు ఏర్పాటు చేసిన రాగిజావను, అంగన్‌వాడి స్కూల్ పిల్లలకు,ప్రభుత్వ పాఠశాల విద్యార్థు లకు, మెడికల్ క్యాంపుకు వచ్చిన ప్రజలకు, డాక్టర్లకు రాగి జావా పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో చిన్నంబావి మండల స్పెషల్ ఆఫీసర్, డిఎల్‌పిఓ రఘునాథ్‌రెడ్డి, ఎంపిడిఓ రమణా రావు, ఎంపిఓ రామస్వామి, పంచాయతీ సెక్రెటరీ రాఘవేంద్ర, సోషల్ వర్కర్‌కోళ్ల ఆంజనేయులు, కిరణ్‌కుమార్‌గౌడ్, పార్వత య్యగౌడ్, చిన్నయ్యగౌడ్, డా.రాజశేఖర్, మెడికల్ ఆఫీసర్ డా.కరుణశ్రీ ఆయుష్, కేశవులు హెచ్ఈ, వెంకటేష్ ఎల్‌టి, జహంగీర్ హెచ్ఎ, సుజాత, రామేశ్వరిఎఎన్ఎంలు, ఆశా వర్కర్, మల్టీ పర్పస్‌వర్కర్స్ ,గ్రామ ప్రజలుయువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## చారకొండ మండల నూతన ఎస్ఐగా షంషుద్దిన్

**కల్వకుర్తి, అక్టోబర్18 ప్రభాతవార్త:** చారకొండ మండల నూతన ఎస్ఐగా షంషుద్దిన్ శుక్రవారం పదవి బాధ్యతలను చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన వెంకట్‌రెడ్డి ఉప్పునుంతల మండలానికి బదిలీ అయ్యారు. మహబూబ్‌నగర్ ట్రాఫిక్ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న షంషుద్దిన్ చారకొండకు బదిలీపై వచ్చారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 2 రోజులు జైలు శిక్ష

**కల్వకుర్తి, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో కల్వకుర్తి పట్టణానికి చెందిన మొహమ్మద్ ఆషఫ్‌ను కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్ఐ మాధవరెడ్డి పేర్కొన్నారు. అట్టి వ్యక్తికి న్యాయమూర్తి కావ్య 2 రోజుల పాటు జైలు శిక్ష, రూ.500ల జరిమానా విధించారని ఎస్ఐ మాధవరెడ్డి పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్య నేరమని, ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**మక్తల్,అక్టోబరు 18 ప్రభాతవార్త:** పట్టణ సమీపంలోని టేకులపల్లి స్టేజీ వద్ద 167వ జాతీయ రహదారిపై బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి తీవ్ర గాయాలపాలై, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. టేకులపల్లికి చెందిన గుడిసె నరసింహులు (40) గురువారం వ్యక్తిగత పని నిమిత్తం మక్తల్ పట్టణానికి వచ్చి, గురువారం రాత్రి 9 గం.ల ప్రాంతంలో తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా గ్రామ సమీపంలోని బయో పెట్రోల్ బంక్ వద్ద హైదరాబాద్ నుంచి రాయచూర్‌కు వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో గుడిసె నరసింహులుకు తీవ్రగాయాలు కాగా, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధి ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూశుక్రవారంఉదయం మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు మక్తల్ ఎస్సై వై.భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఆరేళ్లలోపు ఇద్దరు కుమారులు ఉన్నారు.

## జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన కస్తూర్బా విద్యార్థినిలు



విద్యార్థినిలను అభినందిస్తున్న దృశ్యం

**చిన్నచింతకుంట,అక్టోబరు 18 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యార్థినిలు జిల్లాస్థాయి అండర్ 17 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటారు. జడ్చర్ల పట్టణంలోని బాదేపల్లిలో 68వ జిల్లాస్థాయి పాఠశాలల క్రీడా పోటీలలో మండలానికి చెందిన కస్తూర్బా విద్యార్థినిలు అండర్ 17 వాలీబాల్ పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచి జిల్లా ద్వితీయ బహుమతిని సాధించారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించడంపై కస్తూర్బా పాఠశాల ఎస్ఓ హేమలత, పీఈటీ మమత అభినందనలు తెలిపారు.

## రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించాలి

◆ జిల్లా వైద్యారోగ్య,శాఖ అధికారి డా.సౌభాగ్యలక్ష్మి

**నారాయణపేట టౌన్,అక్టోబరు 18 ప్రభాతవార్త:** రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.సౌభాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం ప్రపంచ ధర్మశాల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పిసియు కేంద్రంలో పాలియేటివ్ కేర్ దినోత్సవం నిర్వహించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఓడిఎమ్ఓ, డిపిఓ, డిపిసిఎన్సిడి పాల్గొన్నారు.

## జిల్లాలో మత్స్య సంపద పెంచి మత్స్యకారులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలి



**నారాయణపేట టౌన్,అక్టోబరు 18 ప్రభాతవార్త:** జిల్లాలో మత్స్య సంపద పెంచి మత్స్యకారులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా నుండి నారాయణపేట జిల్లా మత్స్యశాఖఅధికారిగా బాధ్యతలు తీసుకున్న సయ్యద్ అతికుర్ రెహమాన్, జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేసి ధన్యవాదాలు తెలిపారు.

## మొక్కు తీర్చున్న కాంగ్రెస్ నాయకులు



**నారాయణపేట టౌన్,అక్టోబరు 18 ప్రభాతవార్త:** ఎమ్మెల్యే పర్ణికరెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిస్తే షిరిడి వస్తామని దామరగిద్ద మండల కేంద్రం కాంగ్రెస్ పార్టీ నాయకులు మొక్కుకున్నారు. పర్ణికరెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించడం పట్ల శుక్రవారం షిరిడీ సాయిబాబాను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కును చెల్లించారు. ఎమ్మెల్యే పర్ణికరెడ్డి నాయత్వంలో నారాయణపేట నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని స్వామివారి ఆశీస్సులు ఎమ్మెల్యేపై ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. దర్శించుకున్న వారిలో దామరగిద్ద మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కె. బాల్‌రెడ్డి, ఖాజామియా, వెంకట్రాంరెడ్డి, వెంకటప్ప, తమ్ముడి రఘు, ఆనంద్, పూదరి నర్సప్పతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు అన్నదానం

**నారాయణపేట టౌన్,అక్టోబరు 18 ప్రభాతవార్త :** దసరా పండగ ముగింపు పౌర్ణమి సందర్భంగా దామరగిద్ద మండల కేంద్రంలోని అంబా భవాని ఆలయంలో ఎస్ఎస్‌కె సమాజ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యంగా తీపివంటలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమం లో ఎస్ఎస్‌కె సమాజ్ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి పంటపై పరిశీలన



ఇసోజిపేటలో పత్తిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

**పుల్కల్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఇసోజిపేట గ్రామంలో రైతులు సాగుచేస్తున్న పత్తిపంటలను సంగుపేట ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం సమన్వయకర్త, శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ మాట్లాడుతూ, అధిక సాంద్ర పద్ధతిలో సాగవుతున్న పంటలో ఆకు మాడు, కాయ కుళ్లడం చోటు చేసుకుందన్నారు. తెలుగు నివారణకు 15 రోజుల వ్యవధిలో హెక్సాకోణాజోల్ 2 మిల్లీలీటర్లు లేదా ప్రోపికొనకోల్ 1 మిల్లీలీటరు లేదా క్యాబ్రోటాస్ 3గ్రాములు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 30గ్రాములు లేదా స్ట్రెప్టోసైక్లిన్ లేదా ప్లాంటమైసిన్, 1గ్రాము రాగి సంబంధిత మందు అయిన కాపర్ ఆక్సీక్లోరైడ్ 30గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. శాస్త్రవేత్త కె.సరిత మాట్లాడుతూ వరి,పత్తిపంటలో పాటించాల్సిన సమగ్ర ఎరువులయాజమాన్యం, పురుగుల ఉధృతి గమనించామని, ఎకరాకు 4 నుంచి 6 లింగాకర్షక బట్టలు అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు వెంకట్, సాయిలు, వైపి-2 రేఖా మనోజ్, వైపి-1 శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# టీచర్ల డిఏలు మంజూరు చేయాలి



పిఆర్‌టియు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

**పాపన్నపేట, అక్టోబరు 18, ప్రభాతవార్త:** ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డిఎలను మంజూరు చేయాలని పిఆర్‌టియు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పంతులు రాజు, సురేష్, రాష్ట్ర నాయకులు వెంకటరామిరెడ్డి, లింగప్పలు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన పాపన్నపేటలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 5డిఏలు ఇవ్వాల్సి ఉందని గుర్తుచేశారు. 5 డిఏలలో కనీసం 3డిఏలు అయిన త్వరలోనే మంజూరుచేసేలా త్వరలో నిర్వహించబోయే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని వినతిచేశారు.

# వృద్ధాశ్రమంలో అన్నదానం

**నర్సాపూర్ అక్టోబర్ 18. ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణంలోని విజన్ ఓల్డేజ్ హోమ్‌లో శుక్రవారం నర్సాపూర్ పట్టణానికి చెందిన బిజెపి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, నర్సాపూర్ మున్సిఫల్ 10వ వార్డు కౌన్సిలర్ వనముల బుచ్చేష్‌యాదవ్ ఆధ్వర్యంలో విజన్ ఆశ్రమంలోని వృధ్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈమేరకు బిజెపి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, నర్సాపూర్ మున్సిఫల్ 10వ వార్డు కౌన్సిలర్ వనముల బుచ్చేష్‌యాదవ్ పుట్టిన రోజు సందర్బంగా ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించి వృద్ధులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్బంగా ఈ విజన్ ఆశ్రమంలోని వృద్ధులు బుచ్చేష్‌యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, నర్సాపూర్ మున్సిఫల్ 10వ వార్డు కౌన్సిలర్ వనముల బుచ్చేష్‌యాదవ్‌తో పాటు విజన్ ఓల్డేజ్ హోం నిర్వాహకురాలు అపర్ణారెడ్డి, సిబ్బంది, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# దీపావళికి జూదం ఆడితే జైలుకే

**సిర్గాపూర్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** రానున్న దీపావళి పర్వదినాన్ని పురష్కరించుకుని పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని (ఊసలు లెక్కబడుతారని) ఎస్ఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. పేకాట ఆడితే ఒరిగే లాభం ఏమి ఉండదని, ఆ కుటుంబం రోడ్డు పాలు కాకతప్పదని గుర్తు చేశారు. పేకాటతో అప్పుల పాలై మధ్యానికి బానిసై, ఆరోగ్య చెడిపోయి అవస్థలు పడకతప్పదని హెచ్చరించారు. గ్రామాల్లో గుట్టు చప్పుడుగా జూదం ఆడితే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని మండల ప్రజలకు ఎస్ఐ వెంకట్‌రెడ్డి సూచించారు.

# అక్రమ రిజిస్ట్రేషన్‌పై కోర్టు కేసు



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న భూబాధితులు

**నాగల్‌గిద్ద, అక్టోబరు 18, ప్రభాతవార్త:** కోర్టులో కేసు కొనసాగుతున్నా అక్రమంగా భూమిని రిజిస్ట్రేషన్‌చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకుఉ గణపతి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన నాగల్‌గిద్దలోని రెవిన్యూ కార్యాలయం ముందు బాధిత రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్బంగా గణపతి మాట్లాడుతూ బాధితులకు ఎలాంటి సమాచారం లేకుండా అక్రమంగా రిజిస్ట్రేసన్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. అక్రమార్కులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత రైతులు జగమ్మ, నర్సమ్మలకు న్యాయం చేయాలని గణపతి డిమాండ్ చేశారు.

# మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శ

**శివ్వంపేట,అక్టోబర్ 18 ( ప్రభాతవార్త ):** కారు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం బాధాకరమని మృతి చెందిన కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే సునీతరెడ్డి అన్నారు.శుక్రవారం మండలంలోని తాళ్లపల్లి తాండలో కారు ప్రమాదంలో మృతిచెందిన శివరాం దుర్గమ్మ, బీమ్లా తాండకు చెందిన శాంతి, ఆమె కూతురు అమ్ము, జెగ్య తాండకు చెందిన అనిత, ఆమె కూతుర్లు ఇందు, శ్రావణిలు మృతిచెందగా మూడు కుటుంబాలను ఎమ్మెల్యే సునీతరెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందజేసి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ జరిగిన సంఘటన చాలా బాధాకరమని, మృతిచెందిన కుటుంబాలకు సహాయసహకారాలు అందిస్తామని సునీతరెడ్డి అన్నారు. ప్రమాదం జరిగిన ఘటనాస్థలాన్ని పరిశీలించారు.



మృతిచెందిన కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతరెడ్డి

# గిరిజనులకు అండగా మేముంటాం

## మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**సిర్గాపూర్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** మండలంలోని వాసర్ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవననిర్మాణానికి గిరిజనులకు కేటాయించిన అసైన్‌మెంట్ భూముల్లో కాకుండా ఖాళీగా ఉన్న భూముల్లో (కాంగ్రెస్ నాయకులు కబ్జా చేసుకున్న) నిర్మాణం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక విలేఖరులతో భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబరు 12లో 298 ఎకరాల స్థలం ఉండగా గిరిజనులకు 200 ఎకరాలు అసైన్‌మెంట్ చేశారని, మిగిలిన 98 ఎకరాలు ఖాళీగా ఉందని, ఖాళీగా ఉన్న స్థలాన్ని కాంగ్రెస్ నాయకులు కబ్జా చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రమంత్రి దామోదర్ రాజనర్సింహా, ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిలతో కలిసి భవన నిర్మాణానికి భూమి పూజ చేశారని, అయితే భవననిర్మాణానికి ఎంత నిధులు కేటాయించారో మంత్రి, ఎంపి, ఎమ్మెల్యేలకు తెలియకుండా ఒకరు ఒక్కోలా ప్రకటన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భవననిర్మాణానికి ఎన్ని నిధులు మంజూరు అయ్యాయో ప్రకటించకుండా ప్రజలను మరోమారు మోసం చేసేందుకు కాంగ్రెస్ కుట్రలు పన్నుతోందన్నారు. పాఠశాల భవననిర్మాణానికి గిరిజనులకు కేటాయించిన భూములను వాడుకుంటే గిరిజనులు కోర్టును ఆశ్రయిస్తారని గ్రహించి అభివృద్ధిని బిఆర్ఎస్ అడ్డుకుంటోందని ప్రతిపక్షాలపై కాంగ్రెస్ బురద చల్లే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. తనహయాంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని, కాంగ్రెస్‌లా ఊదరగొట్టుడు పనులు చేయలేదని, అమాయక ప్రజలను మోసం చేయాలేదని పేర్కొన్నారు. గతంలో తమ హయాంలో బిసి, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలకు 5ఎకరాల స్థలాన్ని సేకరించామని, ఆ స్థలంలో రెసిడెన్షియల్ పాఠశాలకు నిధులు మంజూరు చేయించాలని సలహా ఇచ్చారు.



విలేఖరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఎస్సీ ట్రైబల్ పాఠశాలకు 5 కోట్ల రూపాయలు మంజూరు చేయించామని, ఆ నిధులను తీసుకువచ్చి పాఠశాలలను నిర్మించాలని హితవు పలికారు. ప్రస్తుతం కొనసాగుతున్న రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కనుమరుగయ్యాయని, విద్యార్థులు సౌకర్యాల కొరకు రోడ్డెక్కుతున్నారని గుర్తు చేశారు. ప్రయివేట్ విద్యాసంస్థల్లో విద్యను అందుకుంటున్న విద్యార్థులకు ఫీజు రియెంబర్స్‌మెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించడంలో పూర్తిగా విఫలం అయిందని ఆందోళన వ్యక్తంచేశారు.

# తహసీల్దార్ ముందు వ్యక్తి బైండోవర్

**పెద్దేముల్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** మద్యం సేవించి న్యూసెన్స్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పెద్దేముల్ ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం, పెద్దేముల్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన మట్ట శ్రీనివాస్ ఈ నెల 17న రాత్రి మద్యం సేవించి న్యూసెన్స్ క్రియేట్ చేయగా అతనిపై కేసునమోదు చేసుకొని శుక్రవారం తహసిల్దార్ కిషన్ ముందు బైండోవర్ చేశారు. మళ్ళీ ఇదే విధంగా న్యూసెన్స్ చేస్తే, రూ.2 లక్షల జరిమాన విధించబడునని హెచ్చరించారు. ఇదే విధంగా ఎవరైన ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తే వారిపైన కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని అన్నారు.

# రైతు సేవాకేంద్రాల పరిశీలన

**రాయపోల్ అక్టోబర్18 ప్రభాతవార్త:** రాయపోల్ మండల కేంద్రంలోని అగ్రో రైతు సేవాకేంద్రాలను మండల వ్యవసాయ శాఖాధికారి నరేష్ పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ..రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అదే విధంగా గడువు ముగిసిన విత్తనాలు, పురుగుమందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని వారికి సూచించారు.

# వివాహిత మృతి

**చౌటకూరు, అక్టోబరు 18, ప్రభాతవార్త:** మండలంలోని గొంగోజిపేటకు చెందిన వివాహిత మహిళ మమత (24) మృతిచెందిన సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మమతకు వివాహం జరుగగా, భర్తతో విడాకులు తీసుకుని నామనమ్మ వద్ద నివాసం ఉంటోంది. మూడు రోజుల క్రితం ఇంటి వద్ద నుంచి వెళ్లిన మమత చక్రియాల గ్రామశివారులో హున్నాపూర్ గ్రామం వద్ద సంగారెడ్డి-నాందేడ్ అకోలా 161 జాతీయ రహదారి పక్కన శవమై కనిపించింది. విషయం తెలుసుకున్న జోగిపేట సిఐ అనిల్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి మృతదేహాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు, పోస్టుమార్టం నివేదిక అందాక మృతికి సంబంధించి వివరాలు తెలిసే అవకాశాలు ఉంటాయని సిఐ అనిల్‌కుమార్ వివరించారు.

# కోర్టు భవనం ప్రారంభం

**అల్లాదుర్గం, అక్టోబరు 18, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అల్లాదుర్గంలో ఈ నెల 19న హైకోర్టు న్యాయమూర్తి విజయ్‌సేన్‌రెడ్డి జూనియర్ సివిల్ జడ్జి, ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టుభవనాన్ని ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు న్యాయవాది సంగమేష్ తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి మెదక్ జిల్లా న్యాయమూర్తి లక్ష్మీశారద హాజరువుతున్నారన్నారు. కోర్టు భవన ప్రారంభోత్సవ పనులను ఆర్‌డిఓ రమాదేవి న్యాయమూర్తి జితేందర్‌లు పర్యవేక్షించారు. కోర్టుసేవలు ఆరంభం అయితే, అల్లాదుర్గంతో పాటు రేగోడ్, వల్‌పల్లి, పెద్దశంకరంపేట్, టేక్మాల్ మండలాల ప్రజలకు సౌకర్యం కలుగనుంది.

## అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన ఎంపిడివో

**దౌల్తాబాద్,అక్టోబర్ 18,ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండల కేంద్రంలోని దౌల్తాబాద్, ర్యాలగుట్టతాండ అంగన్వాడి కేంద్రాలను మండలం ఎంపీడీఓ శ్రీనివాస్ శుక్రవారంరోజు సందర్శించారు. విద్యార్థులకు సరైప సౌకర్యాలు ఉన్నాయా లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడి కార్యాలయాలకు నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్డిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ పంచాయితీ కార్యదర్శి గోపాల్, ర్యాలగుట్టతాండా పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత

### ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

**పూడూరు,అక్టోబరు 18, ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్ల నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం తగిన ప్రాధాన్యతను ఇస్తుందని పరిగి ఎమ్మెల్యే, వికారాబాద్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు .శుక్రవారం పూడూరు మండలం పరిధిలోని కండ్లపల్లి గ్రామానికి ఎంఆర్ నిధులకింద మంజూరీ అయిన రూ.64లక్షల నిధులతో గ్రామం నుండి కండ్ల పల్లి గేట్ వరకు 1.40కిలో మీటర్ల పొడవున నిర్మిస్తున్న బిటిరోడ్డు నిర్మాణపు పనులకు,నిజాంపేట్ మేడిపల్లి గ్రామంలో కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ చేశారు.ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ సిఎంరేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొ క్కటిగా నెం వేరుస్తు న్నాడని వివరించారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర పభుత్వం కృత నిశ్చయంతో ఉందని తెలిపారు.పరిగి నియోజకవర్గంలో రూ.260 కోట్లు రైతులకు రణమాఫీ అయ్యిందన్నారు.ఇప్పటికే పూడూరు మండలంలో రూ.3100 కోట నిధులతో నేవీరాడార్ స్టేషన్ ఏర్పాటు భూమి పూజ చేసినట్లు వివరిం చారు.

# జ్యూట్ బ్యాగుల తయారీని పరిశీలించిన కమిషనర్



మహిళా సంఘం సభ్యులతో మాట్లాడుతున్న కమిషనర్ నర్సయ్య

**గజ్వేల్ టౌన్, అక్టోబర్ 18 (ప్రభాతవార్త):** ఇంద్ర మహిళాశక్తి స్కీంలో భాగంగా మహిళా సంఘం సభ్యులకు యూనియన్ బ్యాంక్ ద్వారా విడుదలైన నిధులను ఉపయోగించి చేస్తున్న జ్యూట్‌బ్యాగుల తయారీని, స్టీల్ బ్యాంక్‌లను గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మహిళాసంఘం సభ్యులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెప్మా సివో సరిత, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియ



నాగల్‌గిద్దలో ఎమ్మెల్సీఓట్ల నమోదు ప్రక్రియ

**నాగల్‌గిద్ద, అక్టోబరు 18, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లోని యుపిఎస్, జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియను శుక్రవారం నిర్వహించారు. మండల కేంద్రమైన అల్లాదుర్గంతో పాటు మండలంలోని దామర్‌గిద్ద యుపిఎస్, కారాముంగి, కరస్‌గుత్తి, నాగల్‌గిద్ద గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు శ్రీకారం చుట్టినట్లు పిఆర్‌టియు అధ్యక్షులు రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నాగనాథ్, నాయకులు గణేష్, విజయేందర్‌రెడ్డి, సూర్యకాంత్, బసవరాజ్, జీవన్, వెంకటలక్ష్మి, జ్యోతి, శ్వేత, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


# స్వయం ఉపాధితోనే అభివృద్ధి

పెద్దేముల్, అక్టోబరు 18, ప్రభాతవార్త: ప్రతి ఒక్కరు స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలని కోటపల్లి మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం పెద్దేముల్ మండలంలోని మంబాపూర్ గ్రామానికి చెందిన సయీద్ ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంటును ఆయన ప్రారంభించారు. ఈ సందర్బంగా ఎస్.నారాయన్‌రెడ్డి మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తు సమయాన్ని వృథా చేసుకోకుండా స్వయం ఉపాధి రంగాలపై దృష్టిసారించాలని అన్నారు. యువత స్వయం ఉపాధిని ఎంచుకోవడం హర్షనీయమని అన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కుల అందజేత

**చిన్నశంకరంపేట, అక్టోబరు 18,ప్రభాతవార్త:** మండల పరిధి ధర్పల్లి గ్రామానికి చెందిన నరసింహారెడ్డి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైంది. శుక్రవారం పుల్లారావు రూ.40వేల రుపాయల చెక్కును ఆయన అందించారు. ఈ సందర్భంగా సీఎం సహానిధి చెక్కుకు సహకరించిన మండల కాంగ్రెస్ నాయకులకు, ఎమ్మెల్యే రోహిత్‌రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# కొత్త ఉపాధ్యాయులు 8 సూచనలు పాటించాలి



కొత్త ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ నాగారం శ్రీనివాస్

**సిర్గాపూర్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** డిఎస్‌సి 2024లో ఉపాధ్యాయులుగా ఎంపికైన కొత్త ఉపాధ్యాయులకు ఎంఈఓ నాగారం శ్రీనివాస్ 8 సూచనలు చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని ఎంఆర్‌సి కార్యాలయంలో మండలంలో విధులు నిర్వహించేందుకు చేరుకున్న 24 మంది కొత్త ఉపాధ్యాయులతో ఎంఈఓ సమావేశం అయి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు విధిగా సమయ పాలన పాటించాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా పిల్లల హాజరు నమోదు చేసి ఎండిఎం నమోదును ఎస్ఎంస్ ప్రతి రోజు మధ్యాహ్నానికి చేరవేయాలన్నారు. పిఎఫ్ఎంఎస్ నందు గ్రాంట్స్ పొందుటకు కెనార బ్యాంక్ నందు సంయుక్త ఖాతాలో ప్రధానోపాధ్యాయులుగా స్పెసిమెన్ బ్యాంకు మేనేజర్‌కు సమర్పించాలన్నారు. అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీ అకౌంట్‌లు ఎస్‌పిఐ సిర్గాపూర్ నందు ఉన్నాయి, అందులో కూడా హెచ్ఎంగా స్పెసిమెనట్ సమర్పించాలన్నారు. యుడిఐఎస్ఈ నందు పిల్ల ఎన్రోల్‌మెంట్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ఉండాలని, అందులోనే పిల్లల, ఉపాధ్యాయుల, పాఠశాల సౌకర్యాల, నోట్ బుక్స్, ఉచిత పుస్తకాల వివరాలు నమోదు చేయాలన్నారు. ఎండిఎం, ప్రశస్త యాప్‌లను అప్‌డేట్ చేయాలన్నారు. నూతన ఉపాధ్యాయులుగా వేతనం పొందుటకు ట్రెజరీ ఐడి నంబరు సిపిఎస్ కొరకు పాన్‌నంబరు తొందరగా అప్లై చేసుకుని తెచ్చుకోవాలన్నారు. సెలవులు నూతన ఉపాధ్యాయులకు ఎన్ని ఉంటాయి, ఎలా వాడుకోవాలి అన్న విషయాలపై ఎంఈఓ నాగారం శ్రీనివాస్ కొత్త ఉపాధ్యాయులకు సూచించారు. విద్యా ప్రమాణాల మెరుగుకు కొత్త ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ పోషకులతో మన్ననలు అందుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాసర్, కడపల్ కాంప్లెక్‌ల ప్రధానోపాధ్యాయులు మంజుల దేశ్‌పాండే, చౌకి వెంకటేశం, ఎంఐఎస్ స్వప్న, సిఆర్‌పిలు ప్రకాష్, శివకుమార్, క్రాంతి, డేటా ఎంట్రీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# దమ్ముంటే హరీష్‌రావు సవాల్‌ను రేవంత్‌రెడ్డి స్వీకరించాలి

**గజ్వేల్, అక్టోబర్ 18 (ప్రభాతవార్త):** మల్లన్నసాగర్ ముంపు గ్రామాల బాధితులకు ఇచ్చిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను మరియు ఫ్లాట్లను, ప్యాకేజీలను, సుందరంగా తీర్చిదిద్దిన కాలనీలను, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు చేసిన అభివృద్ధిని చూడడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తే వెయ్యి మందితో స్వాగతం పలుకుతామని గజ్వేల్ నియోజకవర్గ బిఆర్‌ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ ముంపు గ్రామాలను దేశంలో ఎక్కడాలేని విధంగా తీర్చిదిద్దిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు దక్కుతుందన్నారు. మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు చేసిన సవాల్‌ను రేవంత్ రెడ్డి దమ్ముంటే స్వీకరించాలన్నారు. నష్టపరిహారం అందని సుమారు 400 ముంపు గ్రామాల బాధితులకు 448కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేయాలని మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజల తరపున డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ప్రజలు ఛీకొట్టారన్నారు. మైకుల ముందు ప్రజలను అయోమయానికి గురిచేస్తూ అబద్దాలు మాట్లాడడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటైందన్నారు. దమ్ముంటే రేవంత్‌రెడ్డి ఆర్‌అండ్‌ఆర్ కాలనీని సందర్శించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం 9,600 మంది లబ్ధిదారులకు ప్యాకేజీలను, డబుల్‌బెడ్‌రూం ఇళ్లను, ఫ్లాట్లను కేటాయించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పర్యటించి 448 కోట్లను వెంటనే విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదినెలలు గడుస్తున్నా, 420 హామీలిచ్చి, ఆరు గ్యారంటీలిచ్చి గద్దెనెక్కి తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రాజెక్టుల నిర్మాణంతో లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత కెసిఆర్‌ది కాదా అని అన్నారు. మూసీ సుందరీకరణకు లక్షా 50వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడం ఎంత వరకు సమంజసమో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. మూసీ సుందరీకరణతో ఎన్ని ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, ఎన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తారని రేవంత్‌రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రప్రజలపై రేవంత్‌రెడ్డికి సోయిలేదని, ఢిల్లీ బాసులకు డబ్బుల మూటలు ఇవ్వకపోతే కుర్చీ ఎక్కడ కదులుతుందో అని రేవంత్‌రెడ్డికి భయం పట్టుకుందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి మొద్దు నిద్ర వీడి రాష్ట్రసంక్షేమం కోసం, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలుచేయాలని, చేతకాని పక్షంలో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# పాములపై అవగాహన

**ములుగు, అక్టోబర్ 18 (ప్రభాతవార్త):** ములుగు మండలకేంద్రంలోని అటవీ కళాశాల మరియు పరిశోధన సంస్థ (ఎఫ్‌సిఆర్‌ఐ)లో ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ హైద్రాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం పాములపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండుగంటలపాటు జరిగిన అవగాహన కార్యక్రమంలో భాగంగా విషసర్పాలను, విషంలేని సర్పాలను గుర్తించడం, పాముకాటుకు ప్రథమ చికిత్స చేయడాన్ని ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అటవీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.ఎస్.శ్రీనిధి మాట్లాడుతూ సమాజంలో సర్పాలంటే అందరికీ ప్రతికూలభావన ఉందని, పాములన్నీ ప్రమాదకరమైనవి కాదని తెలిపారు. కేవలం కొన్ని రకాల పాములు మాత్రమే విషపూరితమైనవి మిగిలిన అనేకరకాల పాములు పంటలను నాశనం చేసే ఎలుకలను, కీటకాలను తిని పర్యావరణాన్ని పరిరక్షిస్తూ రైతులకు మేలు చేస్తున్నాయని అన్నారు. పాము కరిచినప్పుడు ప్రథమచికిత్స చాలా ముఖ్యమైనదన్నారు. మనం బ్రతుకుతూ ఇతర జీవరాశులను బ్రతకనివ్వాలనే స్ఫూహతో పాములను రక్షించుకుందాం, పర్యావరణాన్ని కాపాడుకుందాం అన్నారు. కార్యక్రమంలో 120మందికి పైగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# కొత్త టీచర్లకు సన్మానం




మండలానికి వచ్చిన ఉపాధ్యాయులను పిఆర్‌టియు సన్మానిస్తున్న దృశ్యం

**సిర్గాపూర్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా పాఠశాలల్లో విధులు నిర్వహించేందుకు మండలానికి వచ్చిన కొత్త ఉపాధ్యాయులను శుక్రవారం పిఆర్‌టియ నాయకులు శాలఉవాలతో ఘనంగా సన్మానించారు. మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ సమక్షంలో పిఆర్‌టియు మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పిఆర్‌టియు మండల అధ్యక్షులు కర్ర నర్సింగ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా బాధ్యులు మల్లేశం, కార్యదర్శులు లక్ష్మణ్, నర్సుగొండ, నవీన్, డిఎస్‌పి 2024 ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హనుమాన్ ఆలయంలో సప్తమ వార్షికోత్సవం

**నర్సాపూర్ అక్టోబర్ 18. ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణంలోని బస్టాండ్ హనుమాన్ ఆలయంలో శుక్రవారం నవగ్రహ ఆలయ సప్తమ వార్షికోత్సవ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. హనుమాన్ ఆలయ కమిటీ అధ్వర్యంలో నవగ్రహాలయ సప్తమ వార్షికోత్సవ ఉత్సవాలను నిర్వహించగా వేద పండితులు, ఆలయ పూజారి గౌడిచర్ల హరిప్రసాద్ శర్మ వేద మంత్రోచ్చారణల మధ్యన వైదిక నిర్వహణ గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేగాక ఈ ఆలయంలో వార్షికోత్సవం సందర్బంగా నవగ్రహపూజ, గణపతి హోమం, పుణ్యావాచనమ్, వంటి ప్రత్యేక పూజలతో పాటు శ్రీ ప్రసన్నాంజనేయ స్వామికి పంచామృతిభిషేకం, చందనలేపనం, హారతి వంటి ప్రత్యేక పూజలు చేయడం జరిగింది.ఈ మేరకు ఈ పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించడం జరిగింది. అనంతరం మధ్యాహ్నం ఆలయ కమిటీ అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ మేరకు హనుమాన్ ఆలయంలో నవగ్రహాలయ సప్తమ వార్షికోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, ఆలయపూజారి హరిప్రసాద్‌శర్మతో, ఆలయ కమిటీసభ్యులు కుమ్మరి సంజీవ్,కుమ్మరి జ్ఞానేశ్వర్, సదానందం, గోల్ల సత్తయ్యయాదవ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రబారిన తెల్లబంగారం

**నవాబుపేట అక్టోబర్ 17 ప్రభాతవార్త:** రైతును అతివృష్టి వెంటాడుతోంది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చేసిన కష్టం కళ్ళముందే పాడవుతుంటే చూసి తట్టుకోలేక రైతులు విలవిలలాడుతున్నారు. ముఖ్యంగా ప్రధాన వాణిజ్య పంట పత్తి తీవ్ర నిరాశకు గురిచేస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి దాదాపు 25వేల రూపాయల పెట్టుబడి పెట్టి ఆశలన్ని ఈ పంటపైనే పెట్టుకుని సాగుచేశారు. అధిక వర్షాలు కురియడంతో పంట ఎర్రబారి కాయలు కుళ్ళిపోతున్నాయని వారు విచారం వ్యక్తంచేస్తున్నారు. ఆశించిన దిగుబడి కష్టసాధ్యమేనని ఆందోళన చెందుతున్నారు. ఈసారి పెట్టుబడి కూడా ప్రభుత్వం అంధించలేదని దీంతో అప్పుచేసి పెట్టుబడి సమకూర్చుకున్నామని వారు తెలిపారు. కొన్ని లోతట్టు భూముల్లో పంటపొలల్లో నీరుచేరి పంట నిరాశ పరుస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తునారు. మిగతా పంటలు సహితం ఆశించిన విధంగా లేవని వర్షాలకు పొలల్లో నీరు చేరి వేరు కుళ్ళు తెగుళ్ళు సోకి పంట మొక్కలు పడిపోవడం, కుళ్ళిపోవడం జరుగుతోందని రైతులు చెబుతున్నారు. చలక నేలల్లో ప్రస్తుతం పంటలు కొంత ఆశాజనకంగా ఉన్నాయని అంటున్నారు. ఇంతటితో వర్షాలు నిలిచిపోతే పంటలు బతికి బయటపడే అవకాశం ఉన్నదని, కొన్ని నేలల్లో పంటలు బతికి బయటపడే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. కూరగాయల పంటలు కూడా వర్షం అధికమై పాడవుతున్నాయని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆకుకూరలపై వర్షం ప్రభావం అధికంగా ఉందని దీంతో ఆకుకూర పంటలను నమ్ముకున్న రైతులు తీవ్రనిరాశకు లోనవుతున్నారు. కొన్ని పంటలకు పెట్టుబడి రాక తీవ్రంగా నష్టపోయారు. అందుకే కూరగాయల ధరలు మండుతున్నాయని వాపోతున్నారు.